Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 30 - No.7

May 2024



ప్రభావం చూపే

## నాయకత్వం

ఎడిటోరియల్

# ప్రభావం చూపకపోతే...

సోక్రటీస్ 40 సం॥లు, ప్లేటో 50 సం॥లు, అరిస్టాటిల్ 40 సం॥లు బోధించగా, యేసుక్రీస్తు కేవలం 3 1/2 సం॥లే బోధించాడు. గానీ ఈ ముగ్గురు గొప్ప తత్వవేత్తలు ఉమ్మడిగా చూపిన ప్రభావం కంటె యేసుక్రీస్తు పరిచర్య ప్రభావము అనేక రెట్లు గొప్పది. గనుక ఎవరైనా ప్రభావం చూపించాలి అని ఆశపడితే అనుసరించడానికి గొప్ప మాదిరి క్రీస్తుయేసు కన్నా ఈ భూమి మీద మరెవ్వరూ లేరు. నిజానికి ప్రభావం చూపించాల్సింది క్రైస్తవులే ఎందుకంటే వారికి మాదిరి క్రీస్తే కాబట్టి. తీగె ద్రాక్షావల్లిలో నిలిచి ఉంటుంది గనుక ద్రాక్షావల్లిలోని జీవం, శక్తి తీగెలోకి ప్రవహిస్తాయి.

ఎవరైతే యేసు క్రీస్తును విశ్వసించి, ఆయన జీవితాన్ని మాదిరిగా తీసుకొని, ఆయన మాటలకు అనుగుణంగా తమ జీవితాలను మార్చుకొన్నారో వారు తమ సమాజాలలో, ప్రపంచం మీద గొప్ప ప్రభావాన్ని చూపించారు. ఇది చరిత్రలో నిరూపించబడిన గొప్ప సత్యం. క్రీస్తు శిష్యులు, అపొస్తలుడైన పౌలు, సెయింట్ అగస్టీన్, మార్టిన్ లూథర్, మార్టిన్ లూథర్ కింగ్, మదర్ థెరిస్సా, పండిత రమాబాయి, డేవిడ్ లివింగ్స్టన్, విలియం కేరి, బిల్లీగ్రేహం, సియస్ లూయిస్, జాన్‌స్టాట్, భక్తసింగ్ మొ॥వారి జీవితాలను పరిశీలిస్తే మనకు ఈ విషయం అర్థమవుతుంది. వీరు మాత్రమే గాక అనేమంది క్రైస్తవ తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలు, రచయితలు, రాజకీయ, సామాజిక వేత్తలు ఈ ప్రపంచంపై గొప్ప ప్రభావాన్ని చూపించారు. ఈ ప్రభావం మనుష్యుల జీవితాలకు గౌరవాన్ని ఇచ్చేదిగా, రక్షణపొందేలా, సమాజం సరైన మార్గంలో పయనించేటట్లు చేసింది.

"ఈ లోకంలో ప్రతి వ్యక్తి ప్రపంచాన్ని మార్చాలని అనుకుంటాడు, కాని తనను తాను మార్చుకోవాలని ఎవ్వరూ ఆలోచించరు" అని అంటాడు రష్యన్ రచయిత, తత్వవేత్త లియో టాల్‌స్టాయ్. ఇది చాలా వరకు వాస్తవమని అనిపిస్తుంది. సమాజంలో, క్రైస్తవ సంఘంలో, కుటుంబంలో మార్పు రావాలంటే ఏంచేయాలని ప్రజలను, సంఘ సభ్యులను, కుటుంబంలోని వారిని అడిగితే అలా చేయవచ్చు, ఇలా చేయవచ్చు అంటూ అనేక ఉచిత సలహాలు చాలానే ఇస్తారు. కానీ వాటిలో భాగమైన వారు మాత్రం తమ జీవితాలలో వాక్యాను సారమైన మార్పును కోరుకోరు, మార్పుకు ఇష్టపడరు కూడా. అందుకే ఉన్నతమైన ఆలోచనలు, అనుభవంలోకి రాని ఆలోచనలు గానే మిగిలిపోతున్నాయి.

త్రివేంద్రంలో జన్మించి, చెన్నైలో ప్రొఫెసర్‌గా పనిచేసిన ఇనాక్ గారు ఒక సామాన్యుడు. క్రీస్తును స్వంత రక్షకునిగా అంగీకరించి, ఆయన మాటలకు అనుగుణంగా తన జీవితాన్ని మార్చుకొని, ఆయన మాటలకు సంపూర్ణ విధేయత చూపించినందున భారతదేశంలోని కళాశాల విద్యార్థుల జీవితాల్ని క్రీస్తు కొరకు ప్రభావితం చేయడానికి దేవుడు ఆయనను ఉపయోగించుకొన్నాడు. 70 సం॥ల క్రితం కొద్దిమందితో ప్రారంభమైన యుఇయస్ఐ ఈ రోజున వేల కొలది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేస్తుంది.

చీకట్లో వెలుగునిచ్చే ఒక దీపం అనేకులకు మార్గం చూపినట్లు, మకరందంతో నిండిన పుష్పం సీతాకోకచిలుకలను ఆకర్షించినట్లు, దట్టమైన ఆకులు కలిగిన ఒక చెట్టు నిస్సహాయమైన పక్షులకు ఆశ్రయమిచ్చినట్లు ఒక ఇయు విద్యార్థి నిస్సహాయతతో, నిరీక్షణలేని, జీవంలేని తోటి విద్యార్థులను తన ప్రతిభ, ప్రవర్తన, పని ద్వారా ఆకర్షించాలి. తోటివారి జీవితాలపై చెరగని ముద్ర వేయాలి. "నిరాశా వాదులుగా, ఈనాటి సమాజంలో మనం ఏమీ చేయలేము అన్న ధోరణిలో ఉంటే, మనం తీవ్రమైన వేదాంత పిచ్చిలో ఉన్నట్లే. క్రైస్తవులు సమాజంపై ప్రభావం చూపించలేరు అనడం చాలా హాస్యాస్పదం. బైబిల్ పరంగా, చరిత్రపరంగా ఈ అభిప్రాయం తప్పు. శతాబ్దాల చరిత్రలో క్రైస్తవ్యం సమాజంపై చాలా ప్రభావం చూపించింది" అని అంటాడు జాన్ స్టాట్. "మన పుట్టుక సాధారణమైనదే కావచ్చు, మరణం మాత్రం చరిత్ర సృష్టించేదిగా ఉండాలి" లాంటి నినాదాలతో జీవముగల దేవుని నమ్మిని వ్యక్తులు, ఉన్నతమైన వాటికోసం ఆశిస్తూ, ఈ దేశాన్ని మార్చాలని, ప్రభావితం చేయాలని అనేక విధాలుగా పరితపిస్తున్నారు. జీవం కలిగిన దేవునిని నమ్మిన మనం ఎందుకు దేవుని పిలుపును నిర్లక్ష్యం చేస్తున్నాం?

వ్యక్తుల జీవితాలు మారి, వారు సంపూర్ణంగా దేవుని వాక్యానికి లోబడి, దేవుని చిత్త ప్రకారం జీవిస్తే వారి ద్వారా సమాజాలు, సంఘాలు, కుటుంబాలు మారిపోతాయి. యేసుక్రీస్తును నమ్మిన విద్యార్థులుగా, గ్రాడ్యుయేట్స్‌గా కాలేజీల్లో గాని, ఉద్యోగం చేసే ప్రాంతాల్లో గాని ఎంత ప్రభావాన్ని చూపుతున్నాము అనేది ప్రశ్న? 'మీరు ఈ లోకానికి వెలుగు, ఉప్పు' అని దేవుని వాక్యం చెబుతుంది. వెలుగు అక్కడే ఉండకుండా తన పరిధిలో విస్తరిస్తుంది. ఉప్పు వేసినప్పుడు అది అన్నిటిలోకి చొచ్చుకొని పోతుంది. అలా అవి ఉండకపోతే వాటివల్ల ప్రయోజనమేమి ఉండదు.

కాలేజీల్లో గాని, ఉద్యోగం చేసే ప్రాంతాల్లో గాని ఎంతకాలం ఉంటామనేది కాదు గాని ఎంతగా ప్రభావాన్ని చూపాం అనేది ప్రాముఖ్యం. మనం ప్రభావాన్ని చూపలేకపోతే, లోకం మన సమాజాన్ని, కాలేజీలను, చివరికి మనల్ని కూడా ప్రభావితం చేయడానికి సిద్ధంగా ఉంది.

– పి. సునీల్ జాకబ్

# విద్యార్థి జ్వాల



Vol. 30, No. 7 May 2024
UESI Publication Trust - Andhra Pradesh Branch



EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. K. Adam - Sec., Litt.Dept.



CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI Publication Trust -AP Branch
C/o. UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
STUDENTS (1 Year) - Rs. 150
STUDENTS (3 Year) - Rs. 400
GRADUATES (1 Year) - Rs.300
GRADUATES (3 Year) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years) Rs. 2000/-
OVERSEAS (10 Years) - Rs. 2000/-

VIDYARTHI JWALA ACCOUNT NO:

**Account Name: UESI-AP-VIDYARTHI JWALA**

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**Account Name: UNION OF EVANGELICAL STUDENTS**

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**Account Name: UESI-AP-PUBLICATION TRUST**

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**


**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

June: Planning
July: Social Evils
August: Minority - Majority
September: Core Values

**Note:** Please send your writeups on or before
**10th of every month**


## ఎవరికోసం ఈ జీవితం?



యౌవనస్థులారా, ఊరికే బ్రతకడం కంటే దేవుని ఉద్దేశాల కోసం చనిపోవడమే మేలు. లక్షలాదిమంది యువకులు ఎందుకు బతుకుతున్నారో, చదువుతున్నారో వారికి తెలియదు. జీతం కోసం మాత్రమే నీవు చదువుతున్నావంటే నీ కన్నా దౌర్భాగ్యుడు ఎవ్వరుండరు. జీతం కోసం చదువుతుంటే తప్పకుండా నిరుత్సాహాన్ని ఎదుర్కొంటావు. సత్యం కోసం, ఒక కారణం కోసం జీవించు. మన ప్రభువైన యేసుక్రీస్తు కొరకు జీవించడం కంటే ముఖ్యమైన కారణం మరేం కావాలి నీకు. సువార్త ప్రకటించడం కోసం, దేవుని రాజ్యవ్యాప్తి కొరకు మాత్రమే బతుకు, విద్యార్థులను ఆయనకు శిష్యులుగా చేయడం కోసమే బతుకు. ఆయన పరిశుద్ధాత్మ శక్తిద్వారా పనిచేయి. అనేకులను దేవుని దగ్గరకు నడిపించు. నీవు చనిపోయిన తర్వాత నీ సమాధి దగ్గర ఒక్కరైనా నిలబడి “ఒక కారణం కోసం బ్రతికాడు, అనేకులను దేవునికోసం నడిపించి ఆయన జీవితాన్ని ముగించాడని” చెప్పాలి. జీతాల కోసం, సంపద కోసం, ఇళ్ళకోసం, వాహనాలకోసం బ్రతకవద్దు. దేవుని కోసం బ్రతుకు. దేవుని ప్రాధాన్యతల వైపుకు నీ వెంట ఉన్న వారిని నడిపించు. మిమ్మల్ని వెంబడించేవారు, మీ బోధలు వినే వారందరూ యెహోవానే సేవించే విధంగా చూడాలి. మీరు జీవించడానికి దేవుడు మాత్రమే కారణమయ్యేట్లుగా చూడండి. ఒకరోజు మనం కూడా ఈ లోకాన్ని విడిచిపెడతాము గనుక మంచి వారసత్వాన్ని వదిలి వెళదాం.

## లోపలి పేజీల్లో...


- ప్రభావం చూపకపోతే... - 2
- ఎవరి కోసం ఈ జీవితం? - 3
- ప్రభావితం చేస్తూనే ఉండాలి - 4
- నాయకత్వం బైబిల్ ఆధారాలు - 5
- ప్రభావం చూపే నాయకుని జీవనశైలి - 8
- నాయకుడు ప్రభావం చూపలేకపోవడానికి కారణాలు - 11
- సేవా నాయకత్వం - 14
- గొప్ప నాయకులు తప్పలెందుకు చేస్తారు? - 15
- హనోకు దేవునితో నడిచినవాడు - 18
- ప్రభావిత నాయకత్వం - 21
- దేవుని చిత్తాన్ని ఎలా తెలుసుకోవాలి? - 22
- మానవుడు - 25
- సిలువ వేయబడిన హృదయాన్ని నాకివ్వు ప్రభూ - 28
- నాయకత్వం పారడాక్స్ - 29
- ప్రభావం చూపిన నాయకుడు - 31
- నాయకుడంటే నీలా ఉండాలి! - 32

# ప్రభావితం చేస్తూనే ఉండాలి

ప్రపంచాన్ని ప్రభావితం చేసిన వారిలో ప్రథముడు ప్రభువే. పుట్టుక దగ్గర నుండి పునరుత్థానం వరకు ప్రభువు జీవితాన్ని పరిశీలిస్తే ఆయన ప్రభావం అమోఘమైనది, అబ్బురపరచేది, అవధులు లేనిదిగా చూస్తాం. తక్కువ సంవత్సరాలు భూలోకంలో జీవించి, అతి తక్కువ సంవత్సరాలు సేవించి, అత్యంత ప్రభావం చూపిన వారిలో ప్రభువే ప్రథముడు. ప్రభువు పిల్లల ప్రభావవంతమైన జీవితాలకు ఆయన ఆచరణాత్మక జీవితమే ప్రోత్సాహం.

సాధారణంగా ఒక టీచర్ ఒక క్లాస్‌ని, ఒక హెడ్ మాస్టర్ ఒక స్కూల్‌ని, ఒక ప్రిన్సిపల్ ఒక కాలేజ్‌ని, ఒక ముఖ్యమంత్రి ఒక రాష్ట్రాన్ని, ఒక ప్రధాని, అధ్యక్షుడు ఒక దేశాన్ని ప్రభావితం చేయగల్గుతాడు. కానీ యేసుక్రీస్తు మాటల్లో "మీరు లోకమునకు వెలుగైయున్నారు" అనే విషయాన్ని గ్రహించినప్పుడు తన శిష్యుల ప్రభావాన్ని ఆయన ఎంత ప్రధానమైనదిగా భావించారో అర్థమవుతుంది, ఎంత విస్తృతమైనదో విశదమవుతుంది.




విద్యా సంవత్సరంలో చివరికొచ్చిన మనం, మన పరిచర్య, పరిస్థితులు, ఫలితాలు ఈ నెల చివరి రోజుల్లో చూడబోతున్నాం. ఆయన మన ద్వారా జరిగించిన విషయాల కొరకు ఆయనను ప్రస్తుతించబోతున్నాం.

ఈ సందర్భంలో మనం ఏం చేశామనే దానికన్నా, ఎలా జీవించామనేదే ప్రధాన పాత్ర పోషిస్తుంది. లోకంలో వెలుగు పాత్రను పోషించాల్సిన మనం పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రకాశిస్తూనే ఉండాలి. ప్రకాశానికి ప్రారంభం ప్రభువుతో సంబంధమే. ఎన్నో సంవత్సరాల క్రితం ప్రారంభమైన మన సంబంధం, పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రగతి పథంలో పయనిస్తూనే ఉండాలి.

మన ప్రభావం పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రపంచాన్ని ప్రభావితం చేయాలంటే ఆయన ప్రాథమికంగా చెప్పిన విషయాలకే ప్రాధాన్యత ఇవ్వాలి. పరమ తండ్రి హృదయంలో ప్రహర్షం పుట్టించడమే మన ప్రాధాన్యత అయినప్పుడు, ప్రపంచాన్ని ప్రభావితం చేయడమే జీవనశైలి కావాలి. ప్రపంచాన్ని ప్రభావితం చేయడమనేది మన పొరుగు వారితో ప్రారంభమవ్వాలి. 'ఇంట గెలిచి రచ్చ గెలవాలి'.

ప్రభువు పుట్టుక
ప్రభువు ప్రేమ (పట్టించుకొన్న విధానం)
ప్రభువు ప్రార్థన
ప్రభువు ప్రత్యేక జీవన విధానం (పవిత్రత)
ప్రభువు ప్రయాస (పనితీరు)
ప్రభువు ప్రాణం పెట్టిన తీరు
ప్రభువు పునరుత్థానం
ప్రభువు పునరాగమనం (రెండవరాకడ)

ప్రభువు మనమీద పెట్టుకొన్న ప్రగాఢమైన నమ్మకం మనలను ప్రోత్సహిస్తూనే ఉండాలి. ఆయన పోలికలో, ఆయన ప్రతిబింబాలుగా ప్రజలను, ప్రభుత్వాలను, ప్రపంచాన్ని ప్రభావితం చేస్తూనే ఉండాలి. ప్రభువు రాకడ వరకు ప్రగతి పథంలో వెళ్తూనే ఉండాలి.

ఆయన ప్రణాళికలో మీ....

ఆర్. శ్రీనివాస్
యుఇయస్ఐ-ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు



# నాయకత్వం
## బైబిల్ ఆధారాలు

మన ప్రపంచం సమర్థవంతమైన నాయకుల కొరకు వివిధ రంగాల్లో, ముఖ్యంగా సంఘంలో ఎదురు చూస్తూ ఉంది. చరిత్రలో అటు బయట, ఇటు సంఘంలో సమర్థవంతమైన నాయకత్వం ఎంత ప్రభావాన్ని చూపించిందో చెబుతూనే ఉన్నాయి.

వెబ్‌స్టర్ డిక్షనరీ ప్రకారం నాయకుడంటే నడిపించేవాడు, ప్రభావితం చేసేవాడు. అయితే ఒ ఛాంబర్స్ అనే బాప్టిస్ట్ ఇవాంజెలిస్ట్ "నిజమైన నాయకులు తక్కువగా ఉంటారు, వారికోసం ప్రజలు, సమూహాలు నిరంతరం వెదుకుతూనే ఉంటారు" అని అంటాడు. నాయకత్వం అనే అంశం మీద ప్రపంచంలో పుస్తకాలు ఎక్కువగా ఉన్నాయి గానీ, సరైన నాయకుల కోసం ప్రపంచం ఇంకా ప్రయత్నిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో నాయకత్వం గూర్చి దేవుని వాక్యం ఏమి చెబుతుందో చూద్దాం.

### బైబిల్లో నాయకత్వం

బైబిల్లో నాయకత్వం, దేవుని పట్ల ఉన్న నిబద్ధతతో ప్రారంభమవుతుంది. మోషే తన సొంత శైలిలో, సొంత శక్తితో నాయకత్వం చేపట్టాలనుకొన్న తరుణంలో దేవుడు ఆయనను మొదటిగా దర్శించాడు (నిర్గమ 3:4–6). రెండవదిగా పని అప్పగించాడు (నిర్గమ 3:7–11). మూడవదిగా మోషేకు తన చేతి కర్రను సూచనగా ఇచ్చి అధికారమిచ్చాడు. అంతటితో వదలకుండా మోషేతో మాట్లాడి ఆయన గురించి ఇశ్రాయేలీయులకు ఏమి చెప్పాలో చెప్పి ఎక్విప్ చేశాడు (నిర్గమ 3:4,9,12). చివరిగా, స్వయాన దేవుడే మోషేతో ఉంటానని భరోసా ఇచ్చాడు. నాయకునిగా తన సహోదరుడైన అహరోనుతో కలిసి ఎలా పని చేయాలో కూడా సూచనలు ఇచ్చాడు (నిర్గమ 4:10–18). ఇంత సిద్ధపాటు, నిబద్ధతతో కూడినది బైబిల్లో నాయకత్వం.

### ఆధ్యాత్మిక నాయకత్వానికి పునాది దేవుడే

మిషనరీ ఆర్గనైజేషన్స్, యన్‌జివోలు వారి నాయకుల కోసం యుఇయస్‌ఐ వంక చూస్తుందనడం ఎంతో వాస్తవం. భారతదేశంలోని ప్రాముఖ్యమైన మిషన్ ఆర్గనైజేషన్స్‌లోని నాయకులు చాలావరకు యుఇయస్‌ఐ నుండే వచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభావితం చేయాల్సిన ఇవాంజెలికల్ లీడర్స్ మౌనంగా ఉంటే తన తరాన్ని పోగొట్టుకొంటారు. ఈ సందర్భంలో ఎస్తేరుకి మొర్దెకై చేసిన సవాలు ఎస్తేరు నోరు తెరిపించి, రిస్క్ తీసుకొనేలా ప్రోత్సహించింది. నాయకత్వం అనేది సృష్టి ఆజ్ఞలోనూ (ఆది 1:28), ప్రభువిచ్చిన ప్రేషిత ఆజ్ఞలోనూ భాగం కాదా? అసలు నాయకుడు నడిపించడం, ప్రభావితం చేయడం వల్ల ఇతరులకు దేవునిని సేవించే అవకాశం కల్పిస్తాడు. కాబట్టి సంఘం, దేశం, యుఇయస్‌ఐ లాంటి ఉద్యమాల యొక్క ఆరోగ్యం ఖచ్చితంగా దైవికమైన స్త్రీ, పురుష నాయకుల మీద ఆధారపడి ఉంది. "దైవికమైన నాయకత్వం చచ్చిపోతే లేక దర్శనంతో కూడిన నాయకత్వం చచ్చిపోతే ఆర్గనైజేషన్ చచ్చిపోతుందని" అన్నాడో భక్తుడు. కాబట్టి ఆధ్యాత్మిక నాయకత్వానికి పునాది దేవుడు, ఆయన వాక్యమే.

### బైబిల్లోని నాయకత్వాన్ని వివరించడానికి ఉపయోగించిన మూడు ప్రాముఖ్యమైన చిత్రాలు

**1. గృహ నిర్వాహకుడు:** ఇందులో నాయకులు గుర్తిం

చాల్సింది ఏంటంటే నాయకత్వం చేపట్టడానికి నావద్ద ఉన్న తలాంతులు, సామర్థ్యాలు, అవకాశాలన్నీ దేవుడిచ్చినవే. అవి నాదగ్గర ఉన్నాయంటే దేవుని కృపే. అయితే నాయకులు మంచి గృహ నిర్వాహకులుగా వీటన్నిటిని వాడి ఆయనను మహిమ పరచాలి, ఆయనకు లెక్క అప్పగించాలి. ప్రభువు చెప్పిన ఉపమానంలో ఈ విషయాలు స్పష్టంగా ఉన్నాయి. ఇందుకు ప్రభువు జీవితమే మనకు మాదిరి.

**2. సేవకుడు:** నాయకత్వం అంటే పొజిషన్, పవర్ కాదుగానీ దీనమనసుతో ఇతరులను సేవించడం. దీన్ని అర్థం చేసుకోవడానికి ప్రభువు సరైన ఉదాహరణ ఇచ్చాడు. ఆయన భోజన బల్ల దగ్గర శిష్యుల కాళ్ళు కడిగి, మనలను కూడా అలా సేవించమని అడిగాడు. నాయకులు సేవకులుగా ఉండడం ద్వారానే నాయకత్వానికి విలువ వస్తుంది.

**3. కాపరి:** నాయకత్వం ఒక కాపరిలా ఉద్యమం యొక్క దిశను నిర్దేశిస్తుంది. ఆ దిశవైపు నడిపిస్తుంది. ఈ పాత్రలో శ్రద్ధ, పునరుద్ధరించడం, పోషణ, అనవసర విషయాలను కత్తిరించడం, భారం భరించడం, సంరక్షించడం..మొదలైనవి ఉంటాయి.

## నాయకులు ప్రభావితం చేయాలి, పిలుపుకు అనుగుణంగా జీవించాలి

ప్రతి నాయకునికి ప్రభావం చూపే ప్రదేశం ఉంటుంది. గనుక తను నాయకత్వం చేపడుతూ తన చుట్టూ ఉన్న వారిని తయారు చేయాలి. ప్రభావితం చేయాలి. తను ఈ లోకంతో ప్రభావితం అవ్వకూడదు. విసుగక ఎల్లప్పుడూ ప్రభువు పనిలో ప్రయాసపడేవారిగా ఉండాలి (1 కొరింథీ 15:58). దేవుడు ఆది నుండి వాడుకొన్న పాతనిబంధన పితరులు, ప్రవక్తలు, యాజకులు, రాజులు, అపొస్తలులు, పెద్దలు, పాస్టర్స్ అందరూ కూడా లోపాలతో ఉన్నవారు, వైవిధ్యభరితమైన నేపథ్యం గలవారు, బలహీనులే. అయితే ఆయన బలం మనల్ని ఆత్మపూర్ణులుగా మారుస్తూ ఉంది. పోరాటాలు, వ్యతిరేకతలు, అవమానాలు, సవాళ్ళు ఉన్నా నాయకత్వాన్ని చేపట్టి మన తరం వారిని ప్రభావితం చేయాల్సిందే. ప్రేమ కలిగి సత్యం చెప్పే పరిపక్వతలోకి ఎదగాల్సిందే.

"దైవికమైన నాయకులు దేవుని యొక్క నాయకులే. వేర్వేరు నేపథ్యాల నుండి దేవుడు వారిని ఎన్నుకొన్నాడు". ఉదా. దావీదు లాంటి వాళ్ళను సుదూరమైన వ్యవసాయ ప్రాంతం నుండి ఎన్నుకొంటే మరి కొందరిని రాజగృహాల నుండి ఎన్నుకొన్నాడు. వైవిధ్యమైన నేపథ్యాలు అయినప్పటికీ నాయకులు దేవుడు పిలిచిన పిలుపుకు తగినట్లుగా నడచుకోవడమే నాయకత్వపు పరమార్థం.

## పౌలు తీతుకు రాసిన ఉత్తరం



పౌలు మెంటర్ చేసిన తీతు అనే యౌవ్వన నాయకుడికి తను ఉన్న సంఘంలోని వంకర బోధ, జీవితాలు, ప్రవర్తన సరిదిద్ది, సమర్థవంతమైన నాయకులను నియమించాలని ఒక చిన్న ఉత్తరం రాశాడు. ఈ ఉత్తరాన్ని చదవడం ద్వారా నాయకునికి ఉండాల్సిన అర్హతలు, సత్క్రియలు అంటే బ్రతుకు, ఆయన బోధ గురించిన సంగతులు చూద్దాం.పౌలు తాను మెంటర్ చేసిన యువకుడైన తీతును క్రేతు అనే ద్వీపంలో వదలి వెళ్ళిన కొంత కాలానికి ఈ ఉత్తరం రాశాడు. క్రేతీయులు అంటే అబద్ధికులు, దుష్టమృగములు, సోమరులు (1:12) మధ్యలో దైవిక నాయకునిగా నడిపించడం తీతుకు పెద్ద సవాలే. ఈ పుస్తకంలోని అంశాలు ..

**1. శుభములు (1:1–4):** ఇందులో పౌలు ముఖ్యంగా ఆయనను పరిచయం చేసికొన్నదాన్ని బట్టి నాయకులు దేవుడు ఏర్పరచిన వ్యక్తుల విశ్వాసాన్ని నిర్మించడానికి దాసులుగా నియమించబడ్డారు అని తెలుస్తుంది.

**2. నాయకుని లక్షణాలు, అర్హతలు (1:5–16):** ఈ భాగంలో తీతుకు రెండు విషయాలు రాశాడు. మొదటిది, ఎలాంటి వారిని నాయకులుగా నియమించాలి? రెండవది, వాళ్ళు ఏం చేయాలి?

**ఎ. నాయకులు ఎలాంటి లక్షణాలు కలిగి ఉండాలి? (1:5–9):** పౌలు తీతుకు నాయకత్వం అనేది ఒక వ్యక్తి పెత్తనం కాదని అది బహుళత్వం అని, అందుకు నాయకులను (పెద్దలను) నియమించాలని, వారి అర్హతలను గూర్చి ప్రస్తావించాడు.

అతని కుటుంబ జీవితంలో నిందారహితునిగా ఉండాలి. భార్యకు నమ్మకంగా ఉంటూ, పిల్లల్ని భక్తిలో పెంచేవాడిగా ఉండాలని అర్థం. తల్లిదండ్రులుగా మనం మన పిల్లల్ని వారి తరం కోసం దైవిక నాయకులుగా తయారు చేసే శిక్షణా ప్రదేశం మన ఇల్లు. అతని ప్రవర్తనలో నిందారహితునిగా ఉండాలి.

**బి. ఏం చేసేవాడిగా ఉండాలి? (1:10-16):** వాక్యానుసారమైన బోధ చేసేవాడిగా ఉండాలి. ఎందుకంటే స్థానిక సంఘం సరైన సిద్ధాంతం, ఐక్యత, సహవాసం, సేవ మీద ఆధారపడి ఉంటుంది. సత్యం విషయంలో నాయకుడు స్థిరమైన పునాది మీద ఉంటే తన చుట్టూ ఉన్నవారిని నిర్మిస్తూ తప్పుడు బోధ, అసత్యం నుంచి వారిని రక్షించేవాడుగా ఉంటాడు. సిద్ధాంతం కంటే సాంప్రదాయాలు, సంస్కృతికి ప్రాధాన్యత ఇచ్చేవారు, అంతరంగ పరిశుద్ధతకంటే బాహ్యమైనవాటికి ప్రాధాన్యత ఇచ్చేవారు నేడు సంఘాల్లో ఉంటారు కాబట్టి నాయకుడు సిద్ధాంతం నేర్చుకోకపోతే జీవితం లోకానుసారంగా ప్రభావితం అవుతుంది.

**3. నాయకుని బోధ, ప్రాధాన్యతలు (2:1-10):** ఈ భాగంలో పౌలు క్రేతు సంఘంలోని విశ్వాసులకు ఆరోగ్యకరమైన బోధ ముఖ్యమని, చాలా కుటుంబాల్లో వృద్ధులైన పురుషులు, వృద్ధులైన స్త్రీలు, యవ్వన స్త్రీలు, యౌవ్వన పురుషులు వారి ఇళ్ళల్లో ఎలా ప్రవర్తిం చాలో వాక్యం నుండి బోధించమని చెబుతున్నాడు. దైవిక సంసారంలో నుంచి దైవిక సేవ రావాలి. దైవిక కుటుంబాల నుంచి దైవిక సంఘాలు, దైవిక సహవాసాలు నిర్మితమవుతాయి. అందుకే క్రైస్తవ కుటుంబాలు నిర్వీర్యం అయితే సంఘం నిర్వీర్యం అవుతుంది. ప్రసంగ వేదికల నుండి కుటుంబాల ను గూర్చి వాక్య బోధ, కుటుంబ సభ్యులు, సంబంధ బాంధ్యవ్యాలు ఎలా ఉండాలనే బోధ అత్యవసరం. నాయకులు కూడా కుటుంబ బాధ్యతలను సరిగా చేపట్టకపోతే వారు చెప్పే బోధకు విలువ ఉండదు.

**4. నాయకుని మాదిరి, క్రీస్తు తన కృపలో ప్రత్యక్షమై తిరిగి తన మహిమలో కనిపించడం (2:11-15):** ఈ భాగంలో నాయకత్వపు గురిని జ్ఞాపకం చేస్తున్నాడు. మన రక్షకుడైన యేసుక్రీస్తు మహిమను ఎంచాలని, ఆయన ప్రత్యక్షత కొరకు ఎదురుచూస్తూ నీతితో, భక్తితో, నిరీక్షణతో బతకాలని దేవుని వాక్యం బోధిస్తుందని, దానికి ప్రభువే మాదిరని, ఆయన ప్రత్యక్షత మన నాయకత్వానికి ప్రేరణని చెబుతాడు.

**5. నాయకుని సామాజిక బాధ్యత (3:1-8):** నాయకుని పిలుపు - స్వీయ ప్రావీణ్యతతో మొదలై సంసారంలో నిరూపించుకొంటూ, కుటుంబాలను బైబిల్ బోధతో కడుతూ ప్రభువు కృప మీద ఆధారపడాలని ఇంతవరకు చెప్పాడు. ఇప్పుడు తన కాపరత్వం కుటుంబాన్ని దాటుకొని సమాజానికి సాత్వికంతో సత్క్రియలు శ్రద్ధగా ఎలా చేయాలో చెప్పాడు.

**6. నాయకుడు క్రమశిక్షణ చేసేవాడు (3:9-11):** నాయకుడు వ్యక్తిగతంగా తన్నుతాను క్రమశిక్షణ చేసికొంటూ దైవకృపతో నడుస్తూ సంఘంలో లేక ఉద్యమంలో బేధములు కలుగజేసే అవివేక తర్కములకు దూరంగా ఉండాలని, అలాంటి వాళ్ళకు ఒకటి రెండు సార్లు బుద్ధిచెప్పిన తర్వాత కూడా వినకపోతే అట్టివారిని విసర్జించమన్నాడు. నాయకుడు క్రమశిక్షణ చేసేటప్పుడు ఉద్దేశపూర్వకంగా అంటే బుద్ధిచెప్పి వెనక్కి తీసుకొచ్చే ఆలోచనతోనే చేయాలి. అప్పటికీ వినకపోతే విసర్జించాలి. ఈ ప్రక్రియ ఎంతో సున్నితంగా, భయంతో, తనపర బేధం లేకుండా చేయాలి.

**7. నాయకుని సంబంధాలు (3:12-15):** పౌలు సంబంధ బాంధవ్యాలకు ప్రాధాన్యత ఇచ్చేవాడుగా కనబడతాడు. ఆరోగ్యకరమైన సంబంధాల కొరకు పేర్లు గుర్తు పెట్టుకొంటాడు. తద్వారా అందరూ సత్క్రియలు చేయడం నేర్చుకోవాలని, వాటిని శ్రద్ధగా చేయాలని తనవారిని ప్రోత్సహిస్తూ ముగించాడు.

నాయకత్వపు ఆరంభమనేది క్రీస్తు ప్రభువు పట్ల నిబద్ధత అయితే, సత్క్రియలు దాని అంతం. ఇవి వాటంతట అవే రావు కృషి చేయాలి. శ్రద్ధగా సత్క్రియలు చేయడం నేర్చుకోవాలి.

## ముగింపు

విశ్వాసి జీవితంలో ప్రతి స్థాయిలో నాయకత్వపు పాత్ర నిర్వహించడం తప్పనిసరి. తండ్రి-కుటుంబానికి, అన్న-తమ్ముళ్ళకు, అక్క-చెల్లెళ్ళకు, అమ్మ-పిల్లలకు, టీచర్ -విద్యార్థికి, ఆఫీసర్-తన తోటి పనివారికి, గ్రాడ్యుయేట్-యంగ్ గ్రాడ్యుయేట్స్‌కి, స్టూడెంట్స్‌కి నాయకులు. ఇలా ప్రతి దశలో నాయకత్వం ఉంటుంది. అయితే సమకాలీన పరిస్థితుల్లో దైవిక నాయకత్వం సన్నగిల్లుతున్న నేపథ్యంలో బైబిల్ నాయకులను, మన పయనీర్స్‌ను చూద్దాం. ముఖ్యంగా మన ప్రభువువైన యేసు క్రీస్తు కృపమీద ఆధారపడదాం. దైవిక నాయకులుగా మన కుటుంబాలను, ఇయు, ఇజియఫ్‌లను, సంఘాలను, సమాజాన్ని ప్రభావితం చేద్దాం.

**- బి. రంగనాథం,** వైజాగ్



ప్రత్యేకం

## ప్రభావం చూపే
# నాయకుని జీవనశైలి

ప్రపంచ చరిత్రలో సమాజాన్ని ప్రభావితం చేసిన వారిలో మహాత్మా గాంధీ, అంబేద్కర్, అబ్రాహాం లింకన్, నెల్సన్ మండేలా, విన్‌స్టన్ చర్చిల్, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్, మదర్ థెరిస్సా లాంటి వారు ఉండగా, ప్రపంచ క్రైస్తవ సంఘాన్ని ప్రభావితం చేసిన వారిలో మార్టిన్ లూథర్, జాన్‌వెస్లీ, విలియం బూత్, బిల్లీ గ్రాహం, భక్త్ సింగ్, సాధు సుందర్ సింగ్ లాంటి వారు ఎందరో ఉన్నారు. దేశాన్ని, సమాజాన్ని, సంఘాన్ని ప్రభావితం చేయగలిగిన నాయకుల జీవిత శైలి చాలా ప్రత్యేకంగా ఉంటుంది. మరీ ముఖ్యంగా క్రైస్తవ నాయకుల జీవిత శైలి మరింత దైవిక విలువలు కలిగి ఉంటుంది. మన దేశంలో విద్యార్థుల మధ్య జరిగే పరిచర్య అలాంటి మహోన్నత వ్యక్తుల జీవిత శైలి ద్వారా ఉద్భవించిందే.

### నాయకుడంటే?

ఉమ్మడి లక్ష్యాన్ని సాధించడానికి భాగస్థులైనవారిని ప్రభావితం చేసేవాడే నాయకుడు. భవిష్యత్ కోసం ఒక దర్శనాన్ని (విజన్) రూపించి, దాన్ని చేరుకోవడానికి భాగస్తులైన వారినందరినీ పురికొల్పేవాడే నాయకుడు. నాయకత్వ నిపుణుడు జాన్ సి. మాక్స్‌వెల్ ఇచ్చే నిర్వచనం చాలా సరళంగా ఉంది. "నాయకుడు అంటే మార్గం తెలిసినోడు, మార్గంలో వెళ్ళేవాడు, మార్గం చూపేవాడు".

విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ పట్ల దేవుని చిత్తమేంటో తెలుసుకొని, దేవుని శక్తిపై ఆధారపడుతూ, దేవుని పద్ధతులు వాడుతూ, దేవుని మహిమార్థమై, వారిని అక్కడికి చేర్చడానికి మాదిరి కలిగి ముందు నడిచే ప్రేరకుడే 'యూనియన్ ఆఫ్ ఇవాంజిలికల్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా'కు సంబంధించిన 'ఆధ్యాత్మిక నాయకుడు'. ఈ సంక్షిప్త వ్యాసంలో ప్రభావవంతమైన నాయకుడు / నాయకురాలికి ఉండాల్సిన కొన్ని ముఖ్యమైన లక్షణాలేంటో చూద్దాం.

### ప్రభావం చూపే నాయకుల లక్షణాలు

**ప్రేమ:** ఆధ్యాత్మిక నాయకుడు అగాపే ప్రేమికుడు. అతడు రక్షణపొంది, దేవుని ప్రేమను ఎరిగినవాడై, అదే ప్రేమను అరమరికలు, తారతమ్యాలు, కుల బేధాలు లేకుండా అందరికీ సమృద్ధిగా పంచేవాడై ఉండాలి. ఆ ప్రేమ పలకరింపులోను, పట్టింపులోను, అనగా మాటలోను, క్రియలోను కనబరచాలి. స్వార్థంతో గుంపును విభజించి వారిలో చేదుబీజాలు నాటేవాడు కాకుండా, తనపర బేధాలకు అతీతంగా ప్రేమ వలన కార్యసాధకమగు విశ్వాసాన్ని (గలతీ 5:6) సాధన చేయువాడై ఉండాలి.

మోషే నాయకత్వంలో ఇశ్రాయేలీయులను నడిపించడంలో ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొన్నాడు. అతడు ఇశ్రాయేలు సమాజంపై గొప్ప ప్రభావం చూపిన నాయకుడు. తన జీవితంలో ధనసంపదలు, రాచరిక గొప్పతనం కంటే దేవుని ప్రజలతో శ్రమలనుభవించడం మేలని తలంచాడు. ఇతడు ఒక సేవక నాయకుడు మాత్రమే గాక, వారిని అమితంగా ప్రేమించినవాడు. ప్రజలు బంగారు దూడను నిర్మించుకొని దేవునికి విరోధముగా పాపము చేసినప్పుడు వారు నశించిపోకుండా దేవుని సన్నిధిలో గోజాడి-వారి పాపమును పరిహరించవలెనని లేని యెడల దేవుడు రాసిన గ్రంథములో నుండి తన పేరు తొలగించవలెనని కోరాడు. ఇది మోషేకు ప్రజలపై ఉన్న ప్రేమను, బహు జాగ్రత్తను తెలియజేస్తుంది.

**వ్యక్తిగత వాక్యధ్యాన ప్రార్థనలు:** ఆధ్యాత్మిక నాయకుడు వారంలో ఎన్ని బైబిల్ స్టడీస్

తీసుకుంటాడు? ఎన్ని ప్రసంగాలు చేస్తాడు? ఎన్ని ఆర్టికల్స్ రాస్తాడు? ఎంత ఫాలోయింగ్ ఉంది? ఎన్ని కమిటీల్లో ఉన్నాడు? ఎంత సీనియర్? ఇవన్నీ మంచి విషయాలే కాని, వీటిని బట్టి అతని ఆధ్యాత్మిక నాయకత్వాన్ని లెక్కించలేము. అతను/ఆమె అనుదినము క్రమంగా దేవునితో సన్నిహితంగా, తన వ్యక్తిగత మౌనధ్యాన సమయాల్లో వాక్యధ్యానాన్ని, దాని అన్వయాన్ని, ప్రార్థన, దాని ప్రభావాన్ని అనుభవిస్తున్నవాడై ఉండాలి.

మన ప్రభువు (లూకా 6:12), ఆయన అపోస్తలులు (అ.కా. 2:42-47) ఈ విషయంలో చాలా శ్రద్ధ క్రమశిక్షణ కలిగినవారై ఉన్నారు. అందుకే వారు ప్రపంచం మీద, సంఘం మీద చెరగని ప్రభావాన్ని చూపించారు. వారు పరిశుద్ధాత్మ శక్తితో నింపబడి బలమైన సాక్షులుగా జీవించారు. వారి జీవితాల్లో ప్రార్థన, వాక్యధ్యానం, సహవాసం చోటు చేసుకొన్నాయి. భూలోకమును తల్లక్రిందులు చేసేవారని, క్రైస్తవులని పిలవబడ్డారు. ప్రభువుకోసం ప్రాణాల్ని లెక్క చేయలేదు. దేశదేశాలకు చెదరిపోయారు, హతసాక్షులయ్యారు, కానీ గొప్ప ప్రభావంతో క్రీస్తు సువార్త ప్రబలమై వ్యాపించింది.

**పవిత్ర అసంతృప్తి:** ఆధ్యాత్మిక నాయకుడు నిరంతర సాధకుడు. అతనిలో ఒక పవిత్రమైన అసంతృప్తి ఉండాలి. దర్శన విషయంలో ఇక చాలు, ఎంతో కొంత, ఏదో ఒకటి అని సరిపెట్టుకోడు. తనలో ఆరని ఆకలి, తీరని దాహం నిత్యం ఉండాలి. మార్పుకు, ఎదగడానికి, లక్ష్య సాధనకు అడుగులు వేస్తూ, తాను పరిచర్య చేస్తున్న సంస్థను కొత్త పుంతలు తొక్కించాలి. తనతో నడుస్తున్న వారిని ఉత్తేజపర్చాలి.

నేనిదివరకే పట్టుకొనియున్నానని తలంచడం లేదు. నేను ఒకటి చేయుచున్నాను. వెనుక ఉన్నవి మరచి ముందున్న వాటికొరకై వేగిరపడుచున్నాను. క్రీస్తుయేసునందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని, గురియొద్దకే పరుగెత్తుచున్నాను (ఫిలిప్పీ 3:12-14). పౌలుకు ఉన్న ఈ దృక్పథాన్ని నాయకుడు అలవర్చుకోవాలి.

**సానుకూల దృక్పథం:** ఆధ్యాత్మిక నాయకుడు ఆశావాదిగా ఉంటాడు. అలాగని తన నిపుణతలు, సామర్థ్యాల మీద ఆధారపడడు. దేవుడు పరిస్థితులన్నిటిపై నియంత్రణ కలిగి ఉన్నాడు అని నమ్ముతాడు. సంఘంలో, సంస్థలో కొట్టొచ్చినట్టు లోపాలు కనిపిస్తున్నప్పుడు వాటిని ఎత్తి చూపిస్తూనే, వారిలో సానుకూల దృక్పథాన్ని, నిరీక్షణను నింపి అవి సరయ్యేలా చొరవ తీసుకొంటాడు (హెబ్రీ 6:1-9). వారిలో బలహీనతల కంటె బలాల్ని చూచి ప్రోత్సహిస్తాడు. నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలను అన్న పౌలు స్ఫూర్తిని తనలో నింపుకొంటాడు (ఫిలిప్పీ 4:13).

మోషే కనాను దేశాన్ని వేగు చూడడానికి ఇశ్రాయేలీయుల పంద్రెండు గోత్రముల నుండి ఒక్కొక్కరిని పంపాడు. వారు తిరిగి వచ్చినప్పుడు పదిమంది “వారు మన కంటె శక్తిమంతులు వారిని జయించలేమనిరి”. అయితే కాలేబు, యెహోషువ “దాని జయించడానికి మనకు మన శక్తి చాలని, యెహోవా ఆ దేశములో మనలను చేర్చి దానిని మనకిస్తాడని” చెప్పిన తర్వాత ఇశ్రాయేలు జనాంగము యెహోషువ నాయకత్వంలో కనానును స్వాధీనపరచుకోగలిగారు. కొన్ని సందర్భాలలో అధిక సంఖ్యాకులు వ్యతిరేకించినను ప్రభావవంతులయిన నాయకులు వారిని ఒప్పించి దేవుని కార్యములలో ముందుకు నడిపించగలరు.

**నిర్ణయాత్మకం:** ఆధ్యాత్మిక నాయకుడు నిర్ణయాత్మకంగా ఉంటాడు. అవసరమైతే సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడడు. నిర్ణయాలు తీసుకోలేని దుర్బలస్థితికి ఆస్కారం ఇవ్వడు. ఏం చేయకుండా నిర్జీవ స్థితిలో ఉండేకంటే సాహసం చేస్తాడు. ప్రార్థన, వాక్యధ్యానం, దేవుని చిత్తాన్ని గ్రహిస్తూ, పరిశుద్ధాత్మ ప్రేరణతో నిర్ణయం తీసుకొంటాడు. యెన్నాళ్ళు మట్టుకు మీరు రెండు తలంపుల మధ్య తడబడుచుందురు? ఈ రోజు ఎట్టి పరిస్థితిలోనూ నిర్ణయం చేయాల్సిందే అన్న ఏలియా స్ఫూర్తిని అమలు చేస్తాడు (1రాజులు 18:21).

**యధార్థత:** వ్యక్తికైనా, వ్యవస్థకైనా యధార్థత గుండె కాయలాంటిది. ఆధ్యాత్మిక నాయకులకు ఇది ఎంపిక లాంటిది కాదు. ఇది అత్యంత ఆవశ్యం. నాయకుల్లో నిజాయితీ, చిత్తశుద్ధి ఉండాలి. ఇది తన వ్యక్తిగత జీవితంలోనూ, తాను పనిచేస్తున్న స్థలంలోనూ, కుటుంబంలోనూ, సమాజంలోనూ విస్తరించాలి. ఆర్థిక, ఆధ్యాత్మిక, పరిచర్య రంగాల్లో ఆధ్యాత్మిక నాయకుడు నీతి, నిజాయితీ కలిగి ఉంటాడు. మంచి సాక్ష్యం లేవనెత్తుతాడు (1తిమోతి 3:6-7).

దానియేలు తాను పనిచేస్తున్న సంస్థానంలో తన పనిలో నమ్మకస్తునిగా, ప్రార్థనాపరునిగా తన భక్తి జీవితంలో నిబద్ధత కలిగి జీవించాడు. తద్వారా రాజు యెదుట, సంస్థానంలో ఉన్న అధికారుల యెదుట గొప్ప ప్రభావం చూపించాడు. (దాని 6:26).

**స్వీయ నియంత్రణ:** ఆధ్యాత్మిక నాయకుడు ఇతరులను ప్రభువు వైపుకు నడిపించే పనిలో ఉంటూ తాను లోకం వైపుకు నడిచే స్థితిలో ఉండడు. ఆశానిగ్రహం ఆత్మఫలంలో చివరిదని దాన్ని తేలికగా తీసుకోకూడదు (గలతీ 5:22-23). దానిలోని తొమ్మిది తొనలను విశ్వాసులు, నాయకులు స్పృహతో సాధన చేయాలి. ప్రభావం చూపే నాయకుడు అనునిత్యం తన శీలాన్ని కాపాడుకోవాలి. శరీరేచ్ఛలను దురాశలను రోజూ సిలువకు కొట్టి మనస్సాక్షిని నిర్మలంగా ఉంచుకోవాలి (అ.కా. 24:16).

ఐగుప్తు దేశంలో గొప్ప ప్రభావం చూపిన యోసేపు తన భక్తి జీవితాన్ని కాపాడుకోవడానికి - నేనెట్లు ఇంత ఘోరమైన దుష్కార్యము చేసి దేవునికి విరోధముగా పాపము కట్టుకొందునని తన యజమానుని భార్యతో చెప్పాడు (ఆది 39:9).

## విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్, స్టాఫ్ ప్రభావం చూపాలి

**విద్యార్థులు:** విద్యార్థులు యుఇయస్ఐ పరిచర్యలో చాలా కీలకపాత్ర పోషిస్తారు. క్యాంపస్‌లో విద్యార్థి ప్రథమ కర్తవ్యం చదువే అయినప్పటికీ పరిచర్య అనేది దేవుడిచ్చిన ఒక వరంగా భావించాలి. శ్రద్ధగా చదువుతూ అందులో రాణిస్తూ, చదువును, పరిచర్యను బ్యాలెన్స్ చేసుకోవాలి. వ్యక్తిగత సువార్తను అలక్ష్యం చేయకుండా, ప్రభువును ఎరుగని విద్యార్థులను ఇయు బైబిల్ స్టడీస్‌కు, ఇవాంజిలిస్టిక్ క్యాంప్స్‌కు నడిపించాలి. మన రాష్ట్రంలో తిరుపతి, జమ్మలమడుగు, అనకాపల్లి, రాజాం, బాపట్ల ప్రాంతాల్లో ఇయు పరిచర్య విద్యార్థుల చొరవతో ప్రారంభించబడ్డాయి. వారి వ్యక్తిగత సాక్ష్య జీవితం పరిచర్య మీద ప్రభావం చూపించింది.

**గ్రాడ్యుయేట్స్:** గ్రాడ్యుయేట్స్ వ్యక్తిగతంగా అర్థవంతమైన మౌనధ్యాన సమయం, ప్రార్థనా జీవితం కలిగి, వ్యక్తిగత బైబిల్ పఠన చేసికొంటూ దేవునిపై ఆధారపడే తత్వం కలిగి దర్శనంతో పని చేయాలి. వారు మంచి ఓపెన్ హోమ్ కలిగి ఉన్నప్పుడు వారి గృహాలకు వచ్చే విద్యార్థులు వారి మాదిరి జీవితాలకు ప్రభావితులవుతారు. విశాఖపట్నం, తుని, రాజమండ్రి, నర్సాపూర్ లాంటి ప్రదేశాల్లో గ్రాడ్యుయేట్స్ చొరవతో పరిచర్య ప్రారంభించబడింది. ఇప్పుడు బలంగా పనిచేస్తున్న ఐఇయం, యఫ్‌యంపిబి సంస్థలు ఇ.యు. పరిచర్య నుండి వచ్చిన థియోడర్ విలియమ్స్, శ్యామ్ కమలేషన్ గార్లు ప్రారంభించినవే. గ్రాడ్యుయేట్స్ సమాజాన్ని కూడా ప్రభావితం చేయాలి. 1977లో దివిసీమలో వచ్చిన ఉప్పెన సమయంలో బ్ర.దీనబందు గారు కష్టంలో ఉన్న ప్రజలకు యేసుప్రభువు ప్రేమను క్రియారూపంలో చూపించడం మొదలుపెట్టినప్పుడు ఎంతో మంది ఆదరించబడ్డారు. మచిలీపట్నంలో చేసిన పరిచర్య ప్రభావం వల్ల సుమారు 20 క్రైస్తవ సంఘాలు ఏర్పడ్డాయి.

**స్టాఫ్:** యుఇయస్ఐ పరిచర్యలో స్టాఫ్ మంచి రిసోర్స్ పర్సన్స్‌గా, విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్, ఇతర జూనియర్ స్టాఫ్‌కి రోల్ మోడల్‌గా ఉంటూ, సంఘానికి మంచి వక్తలుగా ఉంటూ, పేదరికం, అవినీతి మరియు సాంఘిక దురాచారాలను నిర్మూలించడం ద్వారా సమాజంలో పరివర్తన తీసుకొని రావడానికి శక్తివంతమైన నాయకులు కావచ్చు. పరిచర్య ప్రారంభ దినాలలో పి.సి. వర్గీస్, సత్‌కీర్తిరావు గార్లు దేశమంతా సంచరిస్తూ విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ మధ్య గొప్ప ప్రభావం చూపించారు.

## ముగింపు

ఆధ్యాత్మిక నాయకుడు ఎప్పుడూ తాను చేస్తున్న పని వలన దేవునికి మహిమ తెస్తుందా? లేక ఆయనను బాధపెడుతుందా? అని పరీక్షించుకొంటాడు. సమాజంలో మన ప్రయాణం ఏటికి ఎదురీత లాంటిదే. క్రీస్తే బలంగా, ప్రేమే ఆయుధంగా, సువార్తీకరణే ధ్యేయంగా, ఆత్మల సంపాదనే గురిగా, మన సాక్ష్యం వారి మనస్సాక్షిని కలవరపరచాలి, ప్రేమ వారిని ఆకర్షించాలి. మనలోని సంతృప్తి, సంతోషం వారికి స్పష్టంగా కనిపించాలి. గురిలేని ప్రజల బ్రతుకులకు నీవు చుక్కాని కావాలి. కుళ్ళిపోతున్న ఈ సమాజానికి నీ ప్రవర్తన ద్వారా ప్రభువును చూపాలి (1పేతు 2:12).

**- కె. యోహాను,** తుని



# నాయకుడు

## ప్రభావం చూపలేక పోవడానికి కారణాలు

### నాయకత్వం అంటే?

'నాయకత్వం అంటే మనం ఎక్కడ ఉన్నామో అక్కడ నుండి, ఎక్కడ ఉండాలో అక్కడకు వెళ్ళడం' అని స్టీవ్ చాక్ అంటారు. వ్యక్తులు నాయకులుగా పరిచర్య చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమర్థులైన నాయకుల కొరత ఎంతో ఉంది. అనేక క్రైస్తవ సంస్థలు ముఖ్యంగా మిషనరీ సంస్థలు నాయకుల కోసము ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. అనేకులు క్రైస్తవ నాయకత్వం తీసుకొని దాన్ని ఘనంగా ఎంచక తమ వరాలతో, పరిచర్యలతో సేవ చేస్తున్నారు. నాయకత్వం కోసం ఎదురుచూడని అనేకమంది తమ స్థానిక సంఘాల్లో, సహవాసాల్లో నాయకులు అవుతున్నారు. గృహంలో నాయకుడిగా ఉండడం అనేది అన్నిటికంటే గొప్ప సవాలుగా కనబడుతుంది.

యవ్వనులకు, పెద్ద వారికి నాయకత్వ శిక్షణ ఇవ్వాల్సిన అవసరం మనం గుర్తెరగాలి. శిక్షణ యవ్వనస్తులతో ప్రారంభం కావాలి. అపో. కా. 1:8లో దర్శనం ప్రకారం మన స్వంత ప్రదేశాల్లో శక్తివంతమైన ఆధ్యాత్మిక నాయకులను, దేవుని వాక్యంతో మిళితమైన వారిని తయారు చేయాలి.

### ప్రభావం చూపిన నాయకత్వం

సరైన నాయకత్వం ఆ సహవాసం, గుంపు లేక సంఘం మీద ప్రభావం చూపిస్తుంది. ఈ ప్రభావాన్ని మనము పనిలో గమనిస్తాము. నాయకుల వ్యక్తిత్వం, సాక్ష్యము, సమర్పణ మిగిలిన వారిలో మార్పు తీసుకొని వస్తుంది.

**మోషే:** భూమి మీదనున్న వారందరిలో మిక్కిలి సాత్వికుడు, నా సేవకుడైన మోషే అని, నా ఇల్లంతటిలో నమ్మకమైన వాడు అని దేవుడు మోషే గూర్చి సాక్ష్యమిస్తున్నాడు (సంఖ్యా 12:3,6,7). యెహోవాను ముఖాముఖిగా ఎరిగిన ప్రవక్త (ద్వితీయో 34:12). తన ప్రజల దోషములను దయచేసి క్షమించమని దేవునిని వేడుకొన్నాడు (సంఖ్యా 14:19). అతని విశ్వాసము, ఆత్మీయ లోతులు మనకు చెరగని సవాలుగా ఉన్నాయి (హెబ్రీ 11: 24-30). మోషే జీవితం ఇశ్రాయేలీయుల మీద గొప్ప ప్రభావాన్ని చూపించింది.

**దావీదు:** నా ఇష్టానుసారుడైన మనుష్యుడు, అతడు నా ఉద్దేశములన్నియు నెరవేర్చెను. దేవుని సంకల్పం చొప్పున తన తరమువారికి సేవ చేశాడని (అపో. కా. 13:22, 36) దావీదును గూర్చి చదువుతాం. దావీదు దేవుని కొరకు ఆకలి దప్పులు కలిగి ఉన్నాడు. అతని ఆత్మీయ జీవితంలో అపజయాలు కూడా ఉన్నాయి, వెనుకకు జారాడు, మార్గం నుండి తప్పిపోయాడు. తన జీవితంలో క్లిష్టపరిస్థితులు ఎదురైనా నాకు కలిగిన భయములన్నిటిలో నుండి ఆయన నన్ను తప్పించెను అని చెబుతున్నాడు (కీర్తన 34:4). అతని ఎన్నిక, ఏర్పాటు, అభిషేకము తన

జీవితంలో చివరి వరకు దేవుని సహవాసంలో ఉండడానికి సహాయపడ్డాయి. దావీదు దేవునికి లోబడిన విధానం, దేవుని మందిరము, దేవుని ప్రజల సేవ, దేవుని వాక్యం పట్ల గల తృష్ణ అప్పటి ఇశ్రాయేలీయులనే గాక ఇప్పుడు మనలనూ ప్రభావితం చేస్తున్నది.

**యుఇయస్ఐ చరిత్ర:** యుఇయస్ఐ పరిచర్య ప్రారంభంలో దేవుడు ఏర్పాటు చేసుకొని బలపరిచి ఆయన సాధనాలుగా వాడుకొన్న ప్రియులు ప్రొ. ఇనాక్, డా. స్టైరెట్, పిసి వర్గీస్, సత్యోర్తిరావ్ మొదలైన వారు వారి సాక్ష్యము, జీవన విధానము, ప్రార్థన, విశ్వాసంతో కూడిన పరిచర్య, సమర్పణ, త్యాగము మనలను గత 70 సంవత్సరాలుగా ప్రభావితం చేస్తూనే ఉంది. జోసఫ్ అభిషేకరావు జీవితం (ఎ గ్రెయిన్ ఆఫ్ వీట్) మనల్ని ఎప్పుడూ ప్రభావితం చేస్తూనే ఉంది. అందుకనే ఈ పరిచర్య అభివృద్ధి చెందుతూ విస్తరిస్తుంది. వారి ఆశయాలు, లక్ష్యాలతో మనం ముందుకు వెళుతున్నాము.

అంతేగాక మన తరములోని సీనియర్ గ్రాడ్యుయేట్స్ ఆయా ప్రాంతాల్లో నిలబడి దేవుడిచ్చిన భారమును బట్టి పని చేస్తూ, వారి జీవితాలను, పరిచర్యను మనకు మాదిరిగా, సవాల్‌గా ఉంచారు.

## ప్రభావం చూపలేక పోవడానికి కారణాలు

**అవిధేయత:** దేవుడు మోషేని బండతో మాట్లాడమంటే తన కర్రతో రెండు సార్లు కొట్టాడు (సంఖ్య 20:8). దేవుని మాటకు విధేయత చూపించక, ఇశ్రాయేలీయుల ఎదుట దేవునిని సన్మానించలేదు. మోషే కలిగిన పాత అనుభవాల్ని గమనిస్తే ఎ. కర్రను ఎత్తి చెయ్యి చాపి ఎర్ర సముద్రాన్ని పాయలుగా చేశాడు (నిర్గమ 14:16). బి. చేతి కర్రతో బండను కొట్టగా ప్రజలు తాగడానికి దానిలో నుండి నీళ్ళు వచ్చాయి (నిర్గమ 17:6). బండతో మాట్లాడడం అనే కొత్త అనుభవంలోకి రాలేకపోయాడు. దేవుడు మనలను నూతన అనుభవంలోకి తీసుకొని వెళ్ళడానికి ఆశపడుతున్నాడు కానీ మనం ఇష్టపడడం లేదు. దేవునికి రావలసిన మహిమను దొంగిలిస్తున్నాము.

**పాపం చేయడం:** రాజులు యుద్ధానికి బయలుదేరే సమయంలో దావీదు యెరూషలేములో ఉండి పాపం చేశాడు (2 సమూ 11:27). దేవుడు ఇచ్చిన బాధ్యతలను నమ్మకంగా చేయలేక పోయాడు. సమయం కాని సమయంలో నిద్రపోతూ దేవుని దృష్టికి చెడుతనం జరిగించాడు, దేవుని మాట తృణీకరించాడు (2 సమూ 12:9). తర్వాత నేను పాపం చేశానని ఒప్పుకొన్నాడు (2 సమూ 12:13).



జనసంఖ్యను లెక్కించే విషయంలో కూడా నేను చేసిన పని వలన గొప్ప పాపము కట్టుకొంటిని అని చెప్పాడు (2 సమూ 24:10). దేవుడు మనకు ఇచ్చిన బాధ్యతను, ఆశీర్వాదాలను తక్కువగా ఎంచడం ద్వారా, స్వార్థం, స్వకీయ దురాశ వల్ల ఆత్మీయ జీవితం యొక్క పరిశుద్ధతను, ఘనతను తీసివేస్తుంది. మన అతిశయము, గర్వము దేవుని ఆశీర్వాదాలు పొందకుండా, ఆయన సంకల్పాలు మన యెడల నెరవేరకుండా చేస్తాయి.

**ద్వంద్వ వైఖరి:** జార్జివర్వర్ ఒకే సమయంలో లోకాన్ని, దేవునిని సంతోష పెట్టాలని ప్రయత్నిస్తూ ద్వంద్వ ప్రమాణాలు కలిగి ఉండేవాడని చెప్పేవాడు. నాయకులు ఆ స్థితిని వదిలి పెట్టాలి. ఆత్మీయ వాతావరణంలో పుట్టిన అనేక ఆధునిక క్రైస్తవులు ప్రభలమైన ఆత్మీయ ఎదుగుదలకు పాకులాడడం లేదు. కొందరు లోకాన్ని అనుసరిస్తూ, పరిశుద్ధాత్మ శక్తికి బదులు, తమ పనులు, నైపుణ్యాలు అనే వాటితో చౌకబారు కృత్రిమ శక్తిని తయారు చేసుకొంటున్నారు.

**ఆత్మ నింపుదల లేకపోవడం:** క్రైస్తవ పరిచర్యను నడిపించేవాడు పరిశుద్ధాత్మ దేవుడు. "ఆత్మపూర్ణులైన నాయకులు క్రైస్తవ ఉద్యమం మీద ప్రభావం చూపిస్తారని' ఆస్వాల్డ్ జె శాండర్స్ రాశాడు. ఆత్మపూర్ణుడైన స్తెఫను క్రీస్తు కొరకు బలమైన సాక్షిగా ఉండి, హతసాక్షిగా చనిపోయాడు (అపొ.కా. 6:3,5; 7:55). ఆధ్యాత్మిక నాయకత్వానికి ఆత్మ నింపుదల ప్రాథమిక అవసరం. 'ఎదుగులేని స్థితి, తీవ్రతలోని

లోపము – ఆరంభంలోని పరిస్థితిని చూపిస్తుందని' ఏడబ్ల్యూ టోజర్ అంటాడు.

**గర్వం:** నమ్మకత్వంలో విధేయత అనే భావన ఉంటుంది. స్వేచ్ఛను సమర్థించుకోవడంలో ఒక విధమైన గర్వం ఉంది. ఆత్మీయ గర్వంతో సేవ చేయడం వల్ల ప్రభావం పోగొట్టుకొంటాము, సంక్షోభంలోకి వెళ్ళే ప్రమాదం కూడా ఉంది. ఇతరులను విమర్శించడం, సొంత వ్యక్తిత్వంలోని బలహీనతలు, పరస్పర విరుద్ధ భావాలు కలిగి ఉండడం వలన నాయకత్వం ప్రభావం చూపించడం లేదు. జయశీలుడైన క్రైస్తవుడు ఆత్మీయ విషయాలకు అలవాటు పడిపోయే ప్రమాదం కలదు. సోమరితనం సుఖవాంఛ భయంకరమైన సమస్యలవుతాయి.

**శోధనలకు లొంగడం:** ఆధ్యాత్మిక నాయకులు శోధనలకు లొంగడం గొప్ప ప్రమాదం. వీటి శక్తిని తక్కువగా అంచనా వేయకూడదు. సంఘములో, సహవాసంలో కొందరు దీనివల్ల నాశనమైయ్యారు. 'శోధనలు మన శత్రువుకు లక్ష్యాలు' అని బిల్లీ పెర్కిన్స్ అంటాడు. సాతాను తంత్రములు మనము ఎరిగి ఉండాలి (2 కొరింథీ 2:11).

## నాయకులు ప్రభావం చూపించాలంటే?

క్రైస్తవ నాయకత్వం దేవుడు తన సంకల్పాన్ని బట్టి మనకిచ్చేది. ఒక సహవాసమును, గుంపును నడిపించడం అనేది దేవుని పిలుపు, దేవుడు ఇచ్చిన బాధ్యత. నాయకత్వాన్ని అడిగి తీసుకొంటే దేవుని విధానంలో పని చేయలేము. అడగకుండా పొందినప్పుడు దేవుని సహాయం, సామర్థ్యం, కృప పొందుతాము.

మనకిచ్చిన బాధ్యతల కోసం ప్రతి దినము ప్రార్థనా పూర్వకంగా సిద్ధపడి వాటిని సహవాసం యొక్క క్షేమం, ఆత్మీయ మేలుకొరకు నిర్వహించాలి. ఇతరుల కొరకు గాని, స్వార్థం కొరకు కాదు. యెషయ 49:3లో దేవుని సంకల్పం నిమిత్తం మనలను ఎలా



తయారు చేయాలో ఆయనకు తెలుసు. యాకోబును అనేక సార్లు గద్దిస్తూ, శిక్షిస్తూ ఇశ్రాయేలుగా మారే వరకు అతన్ని సిద్ధపరచాడు.

పరిశుద్ధాత్ముని నడిపింపుతో విశ్వాసంతో ఇతరులను ఉత్తేజపరిచి తమ ఆశలను వారికి అందించే వారంగా ఉండాలి. వాస్తవిక లక్ష్యాలను కలిగి ఉండాలి. సాధ్యాసాధ్యాల విషయంలో కొంత ఇంగిత జ్ఞానం కలిగి ఉండాలి.

మనము చేయాల్సిన పని గూర్చి స్పష్టమైన దర్శనం స్పష్టంగా ఉండాలి. ఇతరుల స్వభావము, ఆలోచనలు, వారి ప్రత్యేక లక్షణాలు మొదలగు వాటిపట్ల అవగాహన కలిగి ఉండాలి. అందుబాటులో ఉన్న సాధనాలను వినియోగించుకోవాలి.

మన యల్‌టి క్యాంపులు, సియంటిసిలు విద్యార్థులకు సరిపోతున్నాయి గానీ గ్రాడ్యుయేట్స్‌కు సరిపోవడం లేదు. టీమ్ మేనేజ్‌మెంట్, నాయకత్వ లక్షణాలు పెంపొందించుట, గ్రూప్ డైనమిక్స్ మొదలగు వాటిని వారికి అందించాలి. అప్పుడు వారు విద్యార్థులను సరైన విధానంలో ప్రభావితం చేయగలుగుతారు.

దానియేలు యోసేపుల వలే వ్యక్తిగత పరిశుద్ధతకు అన్నిటికంటే ప్రాధాన్యత ఇవ్వాలి. అధికారం చెలాయించకుండా పరిచర్య, సేవా గుణాన్ని ప్రదర్శించాలి. ప్రతి ఒక్కరిని గౌరవించాలి. వారి అభిప్రాయాలను టీమ్‌లో చర్చించాలి. నాయకత్వం అనేది నిస్వార్థం, వినయం, తగ్గింపు కలిగి పూర్ణ విశ్వాసంతో ముందుకు పోవాలి. ఇలాంటి నాయకత్వానికి బదులు అక్కడక్కడ విభజించి పాలించే విధానం జరగడం విచారము.

## ముగింపు

నాయకత్వం దేవుడు మనకు ఇచ్చిన అవకాశం. గృహ నిర్వాహకులంగా, నమ్మకంగా మన సహవాసం కొరకు పని చేద్దాం. ఒక సర్వెంట్ లీడర్‌గా, యదార్థత, పవిత్రత, వినయంతో బాధ్యతలు నిర్వహిద్దాం. మన పని మీద మన టీమ్ ఆధారపడుతుంది. వారు నాయకులవైపు చూస్తారు. ఇది కత్తి మీద సాము వంటిది. నాయకుడు తప్పిపోతే వారి టీమ్ అంతా నష్టపోతుంది కనుక దేవుడు కోరే నాయకత్వం కలిగి ఉండడానికి పాటుపడదాం.

**– జి జె రాయ్,** ఒంగోలు

# సేవా నాయకత్వం

(మార్కు 10:35-45)

## నేపథ్యం

నాయకత్వం అంటే అంతా నేనే అని అనుకోవడం, ఉన్నత స్థానాలు అలంకరించడం, అధికారం, ఆధిపత్యం చెలాయించడం, గొప్ప కీర్తిపొందడమే అని అనుకోవడం యేసు క్రీస్తు జీవించిన కాలంలోనూ, నేడూ కనబడుతుంది. ఈ వాక్యభాగంలో శిష్యుల మనసు, గౌరవం, అధికారం, ప్రధానత్వం మీద ఉంటే క్రీస్తు మనసు శ్రమలు, సిలువ, మరణం గురించి ఉంది. గతంలో తన శ్రమలు గురించి చెబుతూ రెండుసార్లు శిష్యత్వంలోని మూల పాఠాల గురించి, ఈ స్థానాల గురించి చెప్పినా వారికి ఏమీ అర్థం కాలేదు. శిష్యుల అంతరంగాన్ని ఎరిగిన యేసు నాయకత్వం అంటే ఏంటో మరలా స్పష్టంగా చెప్పాడు.

నాయకత్వంపై యేసు ప్రభువు బోధను వివరించడానికి రాబర్ట్ కె. గ్రీనిల్ఫ్ తన వ్యాసంలో 'సేవక నాయకుడు' అనే పదాన్ని ఉపయోగించాడు. దేవుడు మోషేను, యెహోషువాను, దావీదును నాయకులుగా నియమించి వారిని నా సేవకులు అన్నాడు. యేసు క్రీస్తు నాయకత్వ శైలి 'సేవా నాయకత్వమే'. దీనినే యేసు ప్రభువు తన అనుచరులకు పదే పదే బోధించాడు.

## బైబిల్ స్టడీ చర్చకు ప్రశ్నలు

1. ఈ వాక్యభాగంలో ఎవరెవరికి మధ్య సంభాషణ జరుగుచున్నది?
2. యాకోబు, యోహాను తమ నాయకుడిని ఎలాంటి ఆలోచనలతో వచ్చి ఏమి అడిగారు?
3. యాకోబు, యోహాను అడిగిన వాటిలో యేసు ప్రభువు ఏ యే విషయాలు సమర్ధించాడు, వేటిని సమర్ధించలేదు?
4. నాయకుడుగా యేసు ప్రభువు శిష్యుల మధ్య ఉన్న తారతమ్యాలను ఎలా తీసి వేశాడు?



ఎవరిని పోలి ఉండొద్దు అని హెచ్చరించాడు? ఎందుకు?


5. నాయకులుగా ఉండడానికి ఇష్టపడేవారు (శిష్యులు) ఎలాంటి లక్షణాలు కలిగి ఉండాలని యేసు ప్రభువు కోరుచున్నాడు?
6 ప్రస్తుత విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్, స్టాఫ్ సేవక నాయకులుగా ఉండడానికి ఇష్టపడేవారు వేటిని విడిచి పెట్టాలి? వేటిలో మనము పాలిభాగస్థులంగా ఉండాలి?
7. మొదటిగా స్థానాలు కంటే నాయకుడికి ఎలాంటి మనస్సు కలిగి ఉండాలని ప్రభువు కోరుచున్నాడు?
8. అన్యజనులు గొప్పవారు కావడానికి ఎలాంటి మార్గాలు ఎంచుకొంటారు? క్రీస్తు యేసులో గొప్పవారు కావాలంటే మనకు ఉన్న మార్గాలు ఏంటి? చర్చించండి.
9. నాయకుడు గొప్పవాడు -సేవకుడు, ప్రముఖుడు - దాసుడు ఒకేసారి ఎలా ఉండగలడో చర్చించండి. మనము మార్చుకోవాల్సిన అభిప్రాయాలేంటి? ఎలాంటి ప్రవర్తన అలవర్చుకోవాలి?
10. ఈ వాక్య భాగాలలో దేవుని ఆరాధించటానికి బయలు పరచబడిన కొత్త సత్యాలు ఏంటి? (39,43,45వ)

- పి.కె. బసవయ్య, స్టాఫ్, విజయవాడ

# గొప్ప నాయకులు తప్పలెందుకు చేస్తారు?

ఉన్నత ఉద్దేశాలతో నాయకత్వ ప్రయాణాన్ని ప్రారంభించిన ఎంతోమంది నాయకులు, కోరుకున్న గమ్యాన్ని చేరుకోకముందే తమ నాయకత్వ ప్రభావాన్ని కోల్పోతుంటారు. చేతులారా తాము చేసిన తప్పుల కారణంగా ఒకప్పటి గొప్ప నాయకులు నాయకత్వ వేదిక నుంచి అర్థాంతరంగా దిగిపోయారు. ఇటీవల "సెంటర్ ఫర్ క్రియేటివ్ లీడర్‌షిప్" నిర్వహించిన అధ్యయనంలో దాదాపు 40% మంది నాయకులు తమను నియమించిన సంస్థల అంచనాలను అందుకోవడంలో విఫలమౌతున్నట్టు తేలింది.

అసలు గొప్పనాయకులు తప్పులెందుకు చేస్తారు? కొత్తతరం నాయకులు అలాంటి తప్పులు దొర్లకుండా ఎలా జాగ్రత్తపడాలి? ఇశ్రాయేలు దేశానికి మొదటి రాజైన సౌలు జీవితాన్ని నిశితంగా పరిశీలించి ఈ ప్రశ్నలకు సమాధానం కనుక్కొనే ప్రయత్నమే ఈ వ్యాసం. సౌలు నాయకత్వ వైఫల్యానికి దారి తీసిన కారణాలు, వాటి ద్వారా మనం నేర్చుకోగలిగిన పాఠాలు ఏంటో చదవండి.



### 1. పెంచి పోషించకపోతే గొప్ప లక్షణాలు క్రమంగా అదృశ్య మవుతాయి

సౌలు రాజుగా తన కెరీర్‌ను ప్రారంభించిన తొలిరోజుల్లో అతనిలో ఎన్నో గొప్ప లక్షణాలు ఉండేవి. అతను తండ్రి మాటను శిరసావహించి గాడిదల అన్వేషణకు బయలుదేరిన బాధ్యతగల కుమారుడు[1]. గౌరవసూచకమైన బహుమతి లేకుండా ప్రవక్త దగ్గరకు వెళ్ళడానికి నిరాకరించిన భక్తిపరుడు[2]. దేవుని నుంచి కొత్త హృదయాన్ని పొందిన భాగ్యవంతుడు[3]. గిట్టనివాళ్ళ ఘాటు విమర్శలను పెడచెవినబెట్టిన ఉదాత్తుడు[4]. తన ప్రజల కోసం మీసం మెలేసి శత్రువులతో పోరాడి గెలిచిన ధీమంతుడు[5]. దేవుని దయను, అనుగ్రహాన్ని పొందిన అభిషిక్తుడు[6]. కానీ తనలోని ఇన్ని గొప్ప లక్షణాలను అతడు పెంచి పోషించుకోలేకపోయాడు. అందుకే నాయకునిగా దేవుని ప్రమాణాలను అందుకోలేక పోయాడు.

ఎడ్వర్డ్ మర్ఫీ అనే విజ్ఞానవేత్త ప్రతిపాదించిన నియమం ప్రకారం "చెడిపోగలిగే ప్రతిది చెడి పోతుంది". మనవైపు నుంచి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోతే అదే జరుగుతుంది. థర్మోడైనమిక్స్ రెండో నియమం కూడా అదే చెబుతుంది. "ఎలాంటి మానవ ప్రమేయం లేనప్పుడు, సహజంగా జరిగే సంఘటనలు, ఒక వ్యవస్థను క్రమంగా మరింత క్రమరాహిత్యానికి నడిపిస్తాయి".

నాయకులు దేవుడు తమకిచ్చిన సామర్థ్యాలను, నైపుణ్యాలను, మంచి లక్షణాలను గుర్తించి, మెరుగుపర్చుకోవాలి. వ్యక్తిగత అభివృద్ధి కోసం సమయం కేటాయించాలి. నాయకుడు ఎదగడం

లేదంటే, దిగజారుతున్నాడనే అర్థం. ముందుకెళ్ళడం లేదంటే వెనుకబడి పోతున్నాడనే అర్థం. అందుకే నాయకులు తమను తాము సమున్నత వ్యక్తులుగా మలచుకొనే పనిలో నిరంతరం నిమగ్నమై ఉండాలి. అలా జరగనప్పుడు నాయకుడు ప్రవహించని నీరులా ఒక స్తబ్ధమైన స్థితికి చేరుకొంటాడు. కాలక్రమేణా ప్రభావాన్ని కోల్పోతాడు.

### 2. ఒక పని తప్పు కాకపోయినంత మాత్రాన ఒప్పు కాదు

యుద్ధానికెళ్ళే ముందు యెహోవాకు బలి అర్పించడం సౌలుకు తప్పుగా తోచలేదు. ఒక ప్రక్క శత్రువులు ఉప్పెనలా ముంచెత్తబోతున్నారు, మరోప్రక్క తన సైన్యంలో అసహనం పెరిగిపోతోంది. ఆలోచించడానికి సమయం లేదు. వెంటనే అర్పణ ముగించి యుద్ధబేరి మోగించకపోతే సర్వనాశనం అయిపోతుంది. సమూయేలు ప్రశ్నించినప్పుడు సౌలు ఇచ్చిన సమాధానం ఇదే[7]. ఏ కోణంలోంచి చూసినా సౌలు చేసింది ఒప్పే, ఒక్క దేవుని కోణంలోంచి తప్పు. దేవుని దృష్టిలో అది ఆజ్ఞను అతిక్రమించడం, అవివేకంగా ప్రవర్తించడం[8].

పరిస్థితుల దృష్ట్యా సమంజసంగా కనిపించేవి దేవుని దృష్టికి ఆమోదయోగ్యమైనవి కాకపోవచ్చు. నాయకులు ఈ విషయాన్ని గ్రహించాలి. పరిస్థితుల ఒత్తిళ్ళు, దేవుని వాక్య విలువల మధ్య నాయకుడు దేనికి తలవంచుతాడనేదే నాయకత్వానికి అసలైన పరీక్ష. తప్పొప్పుల తక్కెడలో తికమకపడే పరిస్థితిని అధిగమించడం నాయకుని ముందున్న పెద్ద సవాలు. నాయకులు తమకంటూ నిర్ణయించుకున్న నైతిక విలువల పునాదుల మీద తమ నాయకత్వ శైలిని, ప్రవర్తననూ నిర్మించుకున్నప్పుడు సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు. సౌలులా తమను తాము సమర్థించుకోవాల్సిన పరిస్థితి ఎదురవ్వకుండా కాపాడుకోగలుగుతారు[9].

కొన్నిసార్లు నాయకులు కార్యసాధనే లక్ష్యంగా పెట్టుకొని, సాధించే పద్ధతుల విషయంలో రాజీ ధోరణిని అనుసరిస్తారు. అలాంటి ధోరణి వల్ల మంచి నాయకులు కూడా తప్పు దారి తొక్కే ప్రమాదం ఉంది. ఇదే విషయాన్ని ధృవీకరిస్తూ మార్క్ సాన్‌బార్న్ ఇలా చెప్పాడు, "ఫలితాలను సాధించే మార్గాలకంటే అవి సాధించడమే ముఖ్యంగా భావించినప్పుడు, నాయకుని అడుగులు వైఫల్యం వైపు పడినట్టే".

### 3. తప్పును అనుమతించడం తప్పు చెయ్యడంతో సమానం

నాయకులు తాము తప్పు చేయకుండా ఉండటమే కాకుండా తమ పరిధిలో తప్పు జరగకుండా చూసుకునే బాధ్యత కూడా వహించాలి. దేవుడిచ్చిన ఆజ్ఞ ప్రకారం అమాలేకీయుల రాజును, శ్రేష్టమైన కొన్ని జంతువులను ఎందుకు చంపలేదని సమూయేలు ప్రశ్నించినప్పుడు, సౌలు ఆ తప్పును ప్రజలు చేసిన తప్పుగా వర్ణించి, తాను తప్పుకొనే ప్రయత్నం చేశాడు. తన అధీనంలో ఉన్న ప్రజలు తన ఇష్టానికి వ్యతిరేకంగా తప్పు చేస్తున్నప్పుడు సౌలు దాన్ని అడ్డుకోలేక పోయాడు. తప్పును అనుమతించడం ద్వారా తాను కూడా తప్పు చేశాడు. ప్రజలకు భయపడి వారికి తలవంచానని ఒప్పుకొన్నాడు. ప్రజలను ప్రభావితం చేయాల్సిన నాయకుడు వారికే భయపడాల్సి రావడం ఆశ్చర్యం కలిగించే విషయం[10]. తన కుటుంబంలోగానీ, తన జట్టులోగానీ తప్పు జరుగుతున్నప్పుడు మంచి నాయకుడు చూస్తూ ఊరుకోడు. నాయకుడు తాను చేసిన దానికే కాదు, చెయ్యనిదానికి కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది.

తప్పు జరిగినప్పుడు కేవలం ఇతరులను నిందించడం మంచి నాయకుల లక్షణం కాదు. నిజమైన నాయకులు ప్రజలనూ, పరిస్థితులనూ, వ్యవస్థనూ నిందిస్తూ కూర్చోరు. సాకులు చూపే అలవాటున్నవారు ఎప్పటికీ నాయకులు కాలేరు. బాధ్యత వహించగలిగిన వాళ్ళే నాయకులు. తన చుట్టూ ఉన్న వ్యవస్థలో లోపమున్నప్పుడు, అందులో తన బాధ్యత కూడా ఉందని గుర్తించేవాడే అసలైన నాయకుడు.

ఒక సమస్యకు పరిష్కారం కావాలనుకొన్నప్పుడు, దానికి సంబంధించిన బాధ్యతను తీసుకోవడం, మనం చెయ్యగలిగింది చెయ్యడమే ఉత్తమమైన మార్గం. అది తప్ప వేరే మార్గమేదైనా సమస్యను జటిలం చేస్తుందే తప్ప పరిష్కరించలేదు.

కుటుంబ నాయకులుగా తల్లిదండ్రులు తమ పిల్లలు తప్పుదోవలో నడుస్తున్నప్పుడు చూసీ చూడనట్టు ఉండటం ప్రమాదకరం. ఏలీ అనే యాజకుడు తన కుమారులు చేసే చెడ్డపనులను ఆపలేకపోవడం వల్ల కుటుంబమంతా నాశనమైపోవడం మనకు తెలియని విషయం కాదు[11]".

## 4. జట్టు సభ్యుల గొప్పదనం నాయకునికి ప్రమాదం కాదు

కొంతమంది నాయకులు తమ జట్టులో నాయకత్వ లక్షణాలు కలిగిన సభ్యులు తమకు ప్రమాదంగా పరిణమిస్తారనే అభిప్రాయంతో వారిని అణచివేసే ప్రయత్నం చేస్తుంటారు. గొల్యాతు సంఘటన తర్వాత దావీదు ఒక గొప్ప నాయకుడిగా ఆవిర్భవించాడు. దావీదులోని సామర్థ్యాన్ని సరైన విధంగా ఉపయోగించుకోవడానికి బదులు సౌలు అతన్ని చంపాలని ప్రయత్నించాడు[12]. దావీదు జీవితంలో నెరవేరుతున్న దేవుని ప్రణాళికను సౌలు గ్రహించి, ప్రోత్సహించలేకపోయాడు. తన జట్టులో దేవుని ప్రణాళికను నెరవేర్చగల యోధుల్ని, కాబోయే రాజుల్ని తయారు చేయగలిగేవాడే నిజమైన నాయకుడు.

నాయకుడు తన జీవితంలో తాను దేవుని ప్రణాళికను నెరవేర్చడమే కాకుండా ఇతరుల్లో కూడా ఆ పని జరిగేలా ప్రోత్సహించాలి. కొంతమంది నాయకులు అలా చేయలేకపోవడానికి కారణం వారిలోని అభద్రతా భావమే. తమలోని గొప్పతనాన్ని గుర్తించలేని నాయకులు ఇతరుల గొప్పతనాన్ని చూసి అసూయపడతారు. నిజమైన నాయకులు తమ జట్టులోని గొప్పతనాన్నీ, జట్టు సభ్యుల విజయాన్ని సంతోషంగా స్వీకరిస్తారు. తమకంటే గొప్ప జట్టును వాళ్ళు తయారుచేస్తారు. రెండోతరం నాయకులను తయారుచెయ్యలేకపోవడం ప్రస్తుత నాయకుల ప్రధానలోపం. ఒక గొప్ప నాయకుని ఆధ్వర్యంలో అభివృద్ధి శిఖరాలను అధిరోహించిన సంస్థలూ, సంఘాలూ ఆ నాయకుని తర్వాత అకస్మాత్తుగా కుప్పకూలిపోవడానికి కారణం ఇదే. నిజమైన నాయకులు అంతా తమ మీదే ఆధారపడేలా చేసుకోరు. తాము లేనప్పుడు కూడా సంస్థలూ, సంఘాలూ సజావుగా నడిచేలా సిద్ధం చేస్తారు.

అలెగ్జాండర్ లాంటి గొప్ప నాయకుడు కూడా, తన తర్వాత రాజ్యాన్ని పరిపాలించే నాయకుణ్ణి తయారుచెయ్యలేకపోయాడంటే ఆశ్చర్యం కలుగకమానదు. జాక్‌వెల్చ్ చెప్పినట్టు "నాయకుడివి కాకముందు విజయమంటే నువ్వు ఎదగడమే, నాయకుడివి అయ్యాక విజయమంటే ఇతరులు ఎదిగేలా చెయ్యడమే". నాయకుడు తయారు చేయాల్సింది అనుచరుల్ని కాదు, నాయకుల్నే అన్న విషయం ప్రతి నాయకుడూ గుర్తించాలి. తన జట్టులోని సామర్థ్యాలను వెలికి తీసి, సానబెట్టి తనకంటే గొప్ప నాయకులను తయారు చెయ్యాలి.

## 5. తప్పు మార్గంలో ముందుకెళ్ళేకొద్దీ వెనక్కి రావడం కష్టం

సౌలు చివరకు ఒక భయంకరమైన పరిస్థితికి చేరుకున్నాడు. తాను దేశం నుంచి వెళ్ళగొట్టిన మాంత్రికులను తానే వెతుకొంటూ బయలుదేరాడు. దేవుడు తన ప్రార్థన వినడం మానేశాడు[13]. బహుశా ఒక నాయకుని జీవితంలో అత్యంత దయనీయమైన స్థితి ఏంటంటే అతడు దేవుని మాటలు వినలేని పరిస్థితి. తమ దేవునితో సన్నిహిత సంబంధం లేని నాయకులు సమాజానికి ప్రమాదకరంగా పరిణమించగలరు.

సౌలు ఒక్కో అడుగూ దేవునికి, దేవుని ప్రణాళికలకూ దూరమవుతూ వెళ్ళాడు. వెనక్కి రాలేనంత కష్టమైన పరిస్థితి అతనికి దాపురించింది. కొంతమంది నాయకులు ఒకదాని తర్వాత మరో తప్పు చేస్తూ దేవుని స్వరం విని, సరిదిద్దుకునే పరిస్థితిని దూరం చేసుకుంటారు. జీవితంలో పాతుకుపోయిన అలవాట్ల నుండి, జీవితంలో భాగంగా మారిపోయిన స్వభావం నుండి బయటపడడం అత్యంత కష్టంగా మారిపోతుంది. కొన్నిసార్లు కఠినమైన మనసుతో పర్యవసానాలకు కూడా సిద్ధపడిపోయే ధోరణి ప్రదర్శిస్తారు.

ప్రమాదమని తెలిసి కూడా పులిమీద సవారీ చేయడం మొదలుపెట్టిన వ్యక్తి కొంతకాలం తర్వాత పులిబారిన పడకుండా దిగి పారిపోలేడు, అలా కొనసాగనూ లేడు. అలాంటి పరిస్థితి రాకుండా ప్రతి నాయకుడూ జాగ్రత్తపడాలి.

ఒక మంచి నాయకునిగా ప్రయాణాన్ని మొదలుపెట్టిన సౌలు తన జీవితంలో చేసిన తప్పులూ, ఫలితంగా ఎదుర్కొన్న పరిస్థితులూ ప్రస్తుత నాయకులకు బలమైన పాఠాలు.

**– విజె డెస్క్**

1) 1సమూ9:3 2) 1సమూ 9:7 3) 1సమూ 10:9 4) 1సమూ 10:27 5) 1సమూ 11:11 6) 1సమూ 11:13 7) 1సమూ 13:11 8) 1సమూ 13:13 9)1సమూ 15:21 10) 1సమూ 15:24 11) 1సమూ 2:29 12) 1సమూ 18:8-13) 1సమూ 28:6.

# హనోకు

## దేవునితో నడిచినవాడు

ఆదికాండంలో నలుగురు హనోకులు కనిపిస్తారు. వారెవరనగా,

1. కయీను పెద్ద కుమారుడైన హనోకు (ఆది 4:17)
2. యెరెదు కుమారుడైన హనోకు (ఆది 5:18)
3. కెతూరా సంతతివాడు, మిద్యాను కుమారుడైన హనోకు (ఆది 25:4)
4. రూబేను పెద్ద కుమారుడైన హనోకు (ఆది 46:9; నిర్గమ 6:14, సంఖ్యా 26:5; 1 దిన5:3), వీరి నే హనోకీయులు అంటారు.

యెరెదు కుమారుడు, ఆదాము నుంచి ఏడవవాడు, దేవునికి విశ్వాస పాత్రుడు, అత్యధిక సంవత్సరాలు (969) జీవించిన మెతూషెలకు తండ్రి, జల ప్రళయం నుంచి తప్పించబడిన నోవహుకు ముత్తాత అయిన హనోకు గురించి కొన్ని విషయాలు చూద్దాం.


ఆదాము సంతానమైన షేతు వంశావళిలో ఏడవవాడు హనోకు. దేవునికి అత్యంత ప్రియుడు, విశ్వాసపాత్రుడు.

(ఆదాము→ షేతు → ఏనోషు → కేయినాను → మహలలేలు →యెరెదు → హనోకు)

ఆదాము సంతానమైన కయీను వంశావళిలో ఏడవవాడు లెమెకు. భ్రష్టుడై దేవునికి ఎంతో దూరంగా జీవించాడు.

(ఆదాము→ కయీను → హనోకు → ఈరాదు → మహూయాయేలు →మతూషాయేలు→ లెమెకు)

యెరెదు కుమారుడైన హనోకు జీవితాన్ని గురించి ఆదికాండం 5:18-24; హెబ్రీ11:5; యూదా పత్రిక 14, 15 వచనాల్లో కనిపిస్తుంది. 300 సంవత్సరాలు దేవునితో కూడా నడిచినవాడు (ఆది 5:22), మరణం చూడకుండా కొనిపోబడినవాడు



(ఆది 5:24, హెబ్రీ11:5), దేవునికి ఇష్టుడు అని సాక్ష్యం పొందినవాడు (హెబ్రీ 11:5), దేవుని ప్రవక్త వలె ప్రజల్ని హెచ్చరించాడు (యూదాపత్రిక 14, 15 వచనాలు). ఆ రోజుల్లో మనుషులు దాదాపు 700 సంవత్సరాల నుంచి 900 సంవత్సరాలు వరకు జీవించేవారు, కానీ ఈ హనోకు కేవలం 365 సంవత్సరాలు మాత్రమే జీవించి, మరణం చూడకుండా కొనిపోబడ్డాడు. కొద్ది జీవితమే కానీ ఎంతో శక్తివంతమైన, ఆదర్శప్రాయమైన జీవితం జీవించాడు. "ఎంతకాలం బ్రతికామన్నది కాదు గాని క్రీస్తుకోసం ఎలా జీవించాము, ఏమి చేశామన్నదే అతి ప్రాముఖ్యం".

### 1. పేరుకు తగిన జీవితం జీవించిన హనోకు

హనోకు అనగా ప్రతిష్ఠింపబడినవాడు, ప్రత్యేకపరచబడినవాడు, ఆరంభించినవాడు, అంకితభావం కలవాడు అని అర్థం. 65 సంవత్సరాలు బ్రతికాడు, 300 సంవత్సరాలు దేవునితో నడిచాడు. 65 సంవత్సరాల తర్వాత అనగా మెతూషెలను కనిన తర్వాత దేవుని కొరకు ప్రత్యేకంగా జీవించాడు. పవిత్రంగా, మాదిరికరంగా, దేవుని

ఉద్దేశాల నెరవేర్పు కొరకు, దేవునికి ప్రియుడిగా, విశ్వాస పాత్రుడిగా, ప్రత్యేకింపబడినవాడననే స్పృహలో బ్రతికాడు. హానోకు దినములలో, సమాజంలో పగ, కక్ష, ఓర్చుకోలేనితనం, హత్యలు, దేవుడున్నాడనే స్పృహ లేకుండా జీవిస్తున్న జనులు, పరిస్థితులు ఉన్నాయి. మనుషుల హృదయంలోని ఊహ అంతయు ఎల్లప్పుడూ కేవలం చెడ్డది అని చూచిన దేవుడు తాను భూమి మీద నరులను సృష్టించినందుకు సంతాపపడుచున్న దినాల మధ్య హానోకు వారి వలె జీవించక ప్రత్యేకంగా జీవించాడు. యేసుక్రీస్తు వారిలాగా పాపుల మధ్యలోనే బ్రతికాడు కానీ పాపం అంటకుండా బ్రతికాడు. భయంకరంగా చెడిపోయిన సమాజంలో ప్రత్యేకంగా జీవించాడు. నిందలు అవమానాల మధ్యలో నోవహు లాగా ప్రత్యేకంగా దేవుని ఉద్దేశాల నెరవేర్పు కొరకు జీవించాడు.

ప్రియ సహోదరుడా/సహోదరి నీవు ఎలా జీవిస్తున్నావు? ఈ అపవిత్రమైన సమాజంలో ఒక విశ్వాసిగా, నీతిమంతునిగా, పరిశుద్ధునిగా, జీవించగలుగుతున్నావా? లేక లోకంతో రాజీపడి పోతున్నావా? ఆలోచించు. ఒక ప్రత్యేకమైన ఉద్దేశంతో దేవుడు నిన్ను రక్షించాడు. నీవు, నేను మన ఇంటిలో, సహవాసంలో, సంఘంలో, సమాజంలో, పనిచేసే స్థలంలో ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా జీవిస్తూ, దేవునికి మహిమ తీసుకొచ్చే వారిగా మనం ఉండాలని దేవుని ఆశ. మనం అలా జీవిస్తున్నామా? లేక నిన్ను బట్టే కదా నా నామము అన్యజనుల మధ్య దూషించబడుచున్నది (రోమా 2:24) అని వాక్యం చెప్పిన రీతిగా జీవిస్తున్నామా?

## 2. దేవునితో కూడా నడిచిన హానోకు

మూడు వందల సంవత్సరాలు దేవునితో కూడా కలసి నడిచాడు. దేవునితో నడవడం అంటే దేవుని దిశలో నడవడం. దేవుని చిత్తానుసారంగా, నిల కడగా, ఆయనతో సహవాసాన్ని అనుభవిస్తూ, విధేయత చూపిస్తూ, భయం కలిగి, సన్నిహితంగా, దేవుని బతిమాలుతూ, నమ్మకంగా, నిజాయితీగా, పరిశుద్ధంగా, యధార్థంగా జీవించడం. ఆదాము హవ్వలు కలిసి దేవునితో నడిచిన అనుభవాన్ని తెలుసుకొని, తాను కూడా అలాంటి అనుభవానికి రావాలనే తృష్ణ కలిగి జీవించాడు.

సమ్మతింపకుండా ఇద్దరు కూడి నడుతురా? (ఆమోసు 3:3) ఆశగల ప్రాణాన్ని దేవుడు తృప్తి పరుస్తాడు (కీర్తనలు 24:4, 37:4). మనల్ని గురించి మనం ఆలోచిస్తున్నప్పుడు, రక్షణ పొందిన మొదట్లో ఉన్న ఆ ప్రేమ, ఆసక్తి, దేవుని కొరకు బతకాలన్న తృష్ణ, దేవుని కొరకు ఆత్మల సంపాదన కొరకైన భారం ఇప్పుడు కూడా ఉందా? లేక సంవత్సరాలు గడిచే కొలది క్రమక్రమంగా తగ్గిపోతుందా? మొదట నీకుండిన ప్రేమను నీవు వదిలితివని నీ మీద తప్పు ఒకటి మోపవలసి ఉన్నది (ప్రకటన 2:4) అనే విధానంలో ఉన్నామా? ప్రార్థన చేసే విషయంలో, వాక్యాన్ని ధ్యానించే విషయంలో, సహవాసానికి వచ్చే విషయంలో ఆసక్తి పెరుగుతుందా? స్తబ్దంగా ఉన్నామా? లేక తగ్గిపోతున్నామా?

## 3. మరణం చూడకుండా కొనిపోబడిన హానోకు

మరణం చూడకుండా కొనిపోబడిన వారు బైబిల్‌లో ఇద్దరు ఉన్నారు, ఒకరు హానోకు (ఆది 5:24;హెబ్రీ 11:5), మరొకరు ఏలియా (2 రాజులు 2:10,11). హానోకు దైవభక్తి, విశ్వాసాన్ని కలిగివుండే విషయంలో, ఇతరులకు మించి జీవించాడు అనడంలో సందేహం లేదు. దేవుని వాక్యాన్ని, ఆయన వాగ్దానాలను నమ్మి జీవించాడు. ఎత్తబడే సంఘానికి ముంగుర్తుగా ఉన్నాడు. విశ్వాసం లేకుండా దేవునికి ఇష్టుడిగా జీవించడం అసాధ్యం. విశ్వాస మూలము కానిది ఏదో అది పాపము (రోమా 14:23). చనిపోకుండా పరలోకానికి వెళ్ళడం అసాధ్యం. అసలు ఎవరూ వెళ్ళలేరు, కానీ దేవుని యెడల తనకున్న విశ్వాసాన్ని బట్టి వెళ్ళగలిగాడు. విశ్వాసమనునది నిరీక్షింపబడువాటి యొక్క నిజ స్వరూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు రుజువునై యున్నది (హెబ్రీ 11:1).“అసాధ్యమైనవి విశ్వాసం ద్వారానే సాధ్యము”. విశ్వాసం ద్వారా






సింహముల నోళ్ళు మూయించారు, నీతి కార్యాలు జరిగించారు, ఎఱ్ఱ సముద్రం, యొర్దాను పాయలుగా చేశారు, సూర్యచంద్రులను ఆపారు.

దేవుని ఉగ్రతకు, నరకానికి పాత్రుడైన మనిషి పరలోకం వెళ్ళడం అసాధ్యం. అదికేవలం క్రీస్తు నందు విశ్వాసముంచడం వలన మాత్రమే సాధ్యం. నరుడు దేవుని దృష్టికి ఎట్లు నిర్దోషియగును? (యోబు 9:2), కేవలం విశ్వాసం ద్వారానే. దేవుని ఉగ్రతకు, నరకానికి పాత్రులైన అనేకులను అనగా – "వీరు మారుమనసు పొందడం అసాధ్యం" అనేటటువంటి వారి కొరకు ప్రయాసపడి, వారు మనము అందరము ఎత్తబడే వధువు సంఘములో ఉండాలనేది దేవుని ఆశ.

## 4. ప్రవక్తయైన హనోకు

హనోకు బైబిల్లో మొదటి ప్రవక్త. సృష్టి ప్రారంభంలోనే, సృష్టి యొక్క అంతం గురించి చెప్పాడు. తన కుమారునికి మెతూషెల అనే పేరు పెట్టాడు. మెతూషెల అనగా "అతని మరణం తర్వాత వచ్చును గాక" అని అర్థం. సహజంగా ఇలాంటి పేరు దేవుడు బయలుపరిస్తేనే తప్ప పెట్టలేరు.

భక్తిహీనులు తాము చేసిన క్రియలను బట్టి దేవుడు వారికి తీర్పు తీరుస్తాడని, యేసుక్రీస్తు ప్రభువు వారు రెండవ రాకడలో వేవేల దూతలతో రాబోవుచున్నాడు అని ప్రవచించాడు. భక్తిహీనులు మారుమనస్సు పొంది దేవుని వైపు తిరగడానికి తన జీవితమంతా ప్రయాసపడ్డాడు. తన కుటుంబాన్ని కూడా సిద్ధం చేశాడు. తాను చెప్పే దేవుని మాటలు ఆలకించినా, ఆలకించకపోయినా ధైర్యంగా దేవుని గురించి ప్రకటించాడు.

మన ఇంటిలోని వారికి, మన చుట్టు ప్రక్కల ఉన్న వారికి, సహోద్యోగులకు దేవుని గురించి చెప్తున్నామా? పరిస్థితులను బట్టి నాకెందుకులే? నేను చెప్తే ఎవరు వింటారులే? అని నిర్లక్ష్యం చేస్తున్నామా? సువార్త ప్రకటించకపోతే నాకు శ్రమ అని పౌలు అన్నాడు (1 కొరింథీ 9:16). పరిస్థితుల న్నింటిని నియంత్రించగల దేవుని వైపు చూస్తూ, నశించిపోతున్న వారిని రక్షిద్దాం. దేవుడు మన చుట్టూ ఉన్న వారిని గురించి తప్పనిసరిగా లెక్క అడుగుతాడు. దేవుడు లెక్కడుగుతాడని కాకపోయినా గృహ నిర్వాహకత్వ పని అప్పగించబడిందని గుర్తు చేసుకొంటూ మన తరంలో నశించిపోతున్న వారి కొరకు ప్రయాసపడదాం.

## 5. దేవునికి ఇష్టుడని సాక్ష్యము పొందిన హనోకు

విశ్వాసం లేకుండా దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము (హెబ్రీ11:6). అనగా "దేవా! సమస్తము నీవల్లనే నాకు సాధ్యం, నీవు లేకుండా నేను ఏమీ చేయలేను, నీవే నాకు ఆధారం" అని పూర్తిగా దేవుని మీద ఆధారపడుట.

దేవుని దృష్టిలో ఏవి యోగ్యమైనవో, మెప్పైనవో, న్యాయమైనవో, సత్యమైనవో, మాన్యమైనవో, పవిత్రమైనవో, రమ్యమైనవో, ఖ్యాతిగలవో వాటి మీదనే ధ్యానముంచేవారు ఇలాంటి సాక్ష్యాన్ని పొందుతారు (ఫిలిప్పీ4:8). మనుషులు పై రూపమును లక్ష్య పెడతారు (1 సమూయేలు16:7) కానీ దేవుడు హృదయమును, తలంపులను, ఊహలను చూసి హనోకు గురించి ఈ సాక్ష్యం ఇస్తున్నాడు.

మన గురించి మనం గొప్పలు చెప్పుకొంటే అది గర్వమవుతుంది. ఇతరులు మన గురించి మంచిగా చెప్తే అది ఘనత అవుతుంది కానీ దేవుడు మన గురించి చెప్పేది మన గుణం (శీలం) అవుతుంది. కాబట్టి మనుషులు మన గురించి పలికే అనుకూల మైన విషయాలను బట్టి తృప్తి చెందక, ఉప్పొంగక, మన గురించి పలికే ప్రతికూలమైన విషయాలను బట్టి కృంగిపోక, దేవుడిచ్చే సాక్ష్యం కొరకు జీవితాంతం ఎదురు చూస్తూ, భళా నమ్మకమైన మంచి దాసుడా (మత్తయి 25:21) అని చెప్పించుకొనే విధానంలో ప్రభువు కొరకు జీవిద్దాం. దేవుడు తనకి ఇష్టమైన వారి జాబితా విడుదల చేస్తే, ఆ జాబితాలో నీ పేరు ఉంటుందా? ప్రియమైన సహోదరుడా/సహోదరి ఆలోచించు!

– ఎలీషా, ప్రగతి, స్టాఫ్, శ్రీకాకుళం



# ప్రభావిత నాయకత్వం

నిరాశ-నిస్పృలతో
నిండియున్న- ఆలోచనలు
న్యూనతా భావ- ప్రకంపనలు
నెమ్మది లేని - నేటి యువతరం

విశ్వాసంలో - వెనుకడుగు
ఫలము లేని- పచ్చని ఆకులు
భారం లేని - బ్రతుకులు
మోకరిల్లే అనుభవం-కనుమరుగు

మదినిండా -పైపైన భక్తి
మసకబారిన - జీవితాలు
నూనె లేక -వెలగని దీపాలు
యువతీ యువకుల - వైనం ఇదే

ఇలాంటి వారి-మధ్యకు
చురుకైన - నాయకులు
లేవాలి - కావాలి
నిందా-రహితులు
స్వస్థ బుద్ధి - గలవారు
లేవాలి - కావాలి

విశ్వాసంతో - నిండుకున్నవారు
ఆత్మజ్ఞానంతో - నిండుకున్నవారు
పరిశుద్ధాత్మతో - నిండుకున్నవారు
పరిచర్య - కొరకు
కావాలి - లేవాలి

పరిశుద్ధ - పౌలు వంటి వారు
పలువురిని - ప్రోత్సహించేవారు
ప్రేషిత సేవకై - పయనించెడివారు
రాళ్లతో - కొట్టబడినా
రక్షణ సువార్తను-వెదజల్లే
క్రైస్తవ - నాయకులు
లేవాలి - రావాలి

పాఫు, పుంపూలియ - పెర్గే
ప్రదేశాలను - ప్రథమ ప్రేషిత
దండయాత్రలో - దర్శించిన
పరిశుద్ధ - పౌలు వంటి
ప్రభావిత పరిచెడి - నాయకులు
లేవాలి - కావాలి

తర్క - వితర్కములకు
దీటుగా - సమాధానమిచ్చుట
అవసరం - ఎంతో అవసరం
లేఖనములను - విశదపరిచే నాయకులు
లేవాలి - కావాలి

ఆహా -
ప్రేషిత - సేవ వలన
ప్రభావితము చెందే - దైవజనుడు తిమోతి
సహోదరులను - స్థిరపరచి
సంఘములను - స్థాపించెడి
పౌలు వంటి - నాయకులు
లేవాలి - కావాలి - రావాలి

యుఇయస్ఐ - విద్యార్థి పరిచర్యలో
నేటి తరానికి - విద్యార్థి లోకమునకు
దేవుని నమ్మిన - విద్యార్థులలో నుండి
ఆత్మీయ - నాయకులు
లేవాలి - కావాలి - రావాలి

సహోదరుడా- నీ వలన
ప్రభావితం -చెందిన
విద్యార్థులు -ఎవరైనా ఉన్నారా
ప్రశ్నించుకో - పరిశీలించుకో!

**– శిఖినం ఎలీషా,** నరసరావుపేట




# దేవుని చిత్తాన్ని

## ఎలా తెలుసుకోవాలి?

దేవుని చిత్తాన్ని తెలుసుకోవడం, దానిని చేయడం అనేది విశ్వాసి జీవితంలో శ్రేష్టమైన విషయం. వాస్తవానికి దేవుని చిత్తంలో ఉండడమనేది క్రైస్తవునికి సురక్షితము.

దేవుని చిత్తము రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి బయలుపరచబడిన చిత్తము. అది లేఖనాలలో స్పష్టంగా తెలియజేయబడింది. మనము అబద్ధమాడకూడదు, వ్యభిచరించకూడదు, దొంగిలించకూడదు మొదలగునవి. ఈ చిత్తము క్రైస్తవ విశ్వాసులందరి పట్ల ఒక్కటే. దీని ఉద్దేశ్యం మనం క్రీస్తు సారూప్యంలోనికి మారడం. దీనిని తెలుసుకోవడానికి మనం ప్రార్థన చేయాల్సిన అవసరం లేదు. వాక్యం చదివితే చాలు.

రెండవది, రహస్య లేదా బయలపరచబడని చిత్తము. మన జీవితం పట్ల ఆయనకు ఉన్న ప్రత్యేకమైన చిత్తము. ఇది ఒక్కో క్రైస్తవుని పట్ల ఒక్కో విధంగా ఉంటుంది. నేను ఎవ్వరిని పెళ్ళి చేసుకోవాలి? దేవా, ఆ అమ్మాయి లేదా ఆ అబ్బాయి పేరు నాకు చెప్పు. నేను ఏ ఉద్యోగము చెయ్యాలి? ఆ కంపెనీ పేరు, ఊరు చెప్పు అని అడుగుతారు. ఇలాంటివి దేవుని వాక్యంలో ఉండవు. ఇలాంటి విషయాలలో మనం ఏమి చేయాలి లేదా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి? అని దేవున్ని అడిగినప్పుడు లేఖనాలలో మనకు ఇవ్వబడిన సూత్రాలకు అనుగుణముగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. దీనిని గురించి మరింత విపులంగా తెలుసుకొందాం.

### బైబిల్ ఆధారాలు

కొలస్సీ 1:9-14 వచనాలలో పౌలు 'ఆయన చిత్తమును పూర్ణముగా గ్రహించినవారునై... దేవుని విషయమైన జ్ఞానమందు అభివృద్ధి పొందుచూ, అన్ని విషయములలో ప్రభువును సంతోష పెట్టాలి' అని వారి కోసం ప్రార్థన చేస్తాడు. కొలస్సీ 4:12లో 'దేవుని చిత్తము విషయంలో సంపూర్ణాత్మ నిశ్చయత కలిగి యుండాలని' ఎపఫ్రా కొలస్సీయుల కోసం ప్రార్థన చేస్తాడు. ఎఫెసీ 5:17లో 'మీరు అవివేకులు కాక దేవుని చిత్తమేమిటో గ్రహించుకొనుడి' అని పౌలు రాస్తాడు. పై లేఖన భాగాలను గమనిస్తే మన పట్ల దేవునికున్న ప్రత్యేక చిత్తాన్ని మనము తెలుసుకోవాలని, దానిని తెలుసుకోవడానికి మనం ప్రయత్నం చేయాలనే విషయం స్పష్టంగా అర్థమవుతుంది. అయితే మనము ఆయన చిత్తాన్ని తెలుసుకొని దానిని చెయ్యగలం అనడానికి నిశ్చయత, ధైర్యం ఆయన మన యొక్క కాపరి. మనలను నడిపిస్తాను, దారి చూపిస్తాను అని వాగ్దానము చేశాడు. నా గొర్రెలు నా స్వరము వినును అవి నన్ను వెంబడిస్తాయని యేసు చెప్పాడు (యోహాను 10:27).

### దేవుని చిత్తం తెలుసుకోవడం ఎలా?

#### 1. దేవుడు మనకు ఇచ్చిన సూత్రాలు, ఉపదేశాలు, ఉదాహరణలను గుర్తించాలి

దేవుడు తన వాక్యములో ఇచ్చిన సూత్రాలు, ఉపదేశాల ద్వారా మనల్ని నడిపిస్తాడు. బైబిల్లో చాలాచోట్ల మనము "ఇది చేయి" అని చెప్పడం చూస్తాము. వాటిని మన జీవితములో ప్రతిరంగానికి

అన్వయించుకొని విధేయత చూపించడం అలవాటు చేసుకోవాలి. జాన్ న్యూటన్ అనే గొప్ప భక్తుడు తన స్నేహితునికి 'దైవిక నడిపింపు' మీద ఉత్తరం రాశాడు. దానిలో దేవుని చిత్తాన్ని కనుగొనడం అనేది ఒక కోణంలో పియానోను నేర్చుకొన్నట్లు ఉంటుంది. అతను దానిని ఎలా ప్లే చేయాలని నేర్చుకొనే ప్రక్రియలో అతను స్కోర్స్ నేర్చుకొంటాడు. అతను ఎంత ఎక్కువగా స్కోర్స్ నేర్చుకొంటే అతనంత స్వేచ్ఛగా దానిని వాయించే సామర్థ్యం కలిగి ఉంటాడు, సంగీతాన్ని గూర్చిన అవగాహనను పెంపొదించుకొంటాడు.

దేవుని చిత్తముతో జీవించడము కూడా అలానే ఉంటుంది . మనకు ఉపదేశించే కరదీపక అయిన బైబిల్ మన జీవితంలో ఒక భాగము కావాలి. వాక్యం మన రక్తములో ప్రసరించాలి. అప్పుడు మనం దేవుడు ఆలోచించేటట్లు ఆలోచించగలుగుతాము. మంచి చెడులను, ఉత్తమం, అత్యుత్తమమైన వాటిని వివేచించగలిగే సామర్థ్యాన్ని పొందుకొంటాము. అలా మనము దేవుని చిత్తమును తెలుసుకొని దానిని చేసి దేవునిని మహిమపరుస్తాము. కాబట్టి మనము దేవుని వాక్యంతో ఎక్కువ సాన్నిహిత్యాన్ని పెంచుకోవాలి. బైబిల్లో ఉన్న సత్యాలు లేదా సూత్రాల వెలుగులో నిర్ణయాలు తీసుకోవడం అలవాటు చేసుకోవాలి. హెబ్రీ 8:10లో దేవుడు చేసిన వాగ్దానము ఏంటంటే పరిశుద్ధాత్ముడు వచ్చినప్పుడు ఆయన దేవుని ధర్మశాస్త్రాన్ని మన హృదయాల మీద రాస్తాడు. అయితే ఆ సూత్రాలను మన జీవితానికి అన్వయించుకోవడానికి మనకు జ్ఞానము అవసరం. గనుక దేవుని వాక్యాన్ని బాగా అర్థం చేసుకోవాలి, దానిని జ్ఞానయుక్తంగా జీవితానికి అన్వయించుకోవాలి. మీరు దేవుని వాక్యం గురించి తెలియనివారైతే, మీరు ఎల్లప్పుడూ దేవుని చిత్తం గురించి అజ్ఞానులుగానే ఉంటారు.

దేవుని వాక్యాన్ని నేర్చుకోవడం అంటే దేవుని మనస్సును తెలుసుకోవడమే. ఇష్టాపూర్వకంగా దేవుని వాక్యాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రమాదాన్ని కొనితెచ్చుకొన్నట్లే. గనుక లేఖనానుసారంగా ఆలోచించడం అలవర్చుకోవాలి. దేవుని వాక్యానికి వెలుపల దేవుని చిత్తాన్ని తెలుసుకోవడం అసాధ్యం.

## 2. వినుటకు వేగిరపడాలి

దేవుడు మన జీవితాలకు జ్ఞానము కలిగిన సలహాదారులను ఇచ్చాడు, వారి మాటలను జాగ్రత్తగా వినాలని ఆయన ఆదేశించాడు. మన గొప్ప అవసరం ఏంటంటే సలహాదారుల మాటలను ఆలకించడం. నాయకులు లేని జనులు చెడిపోవుదురు ఆలోచనకర్తలు అనేకులుండుట రక్షణకరము. (సామెతలు 11:14). మనము జ్ఞాన ప్రేమలు కలిగిన సహవాసంలో సభ్యులం అనే విషయాన్ని మరచిపోకూడదు.



## 3. మోకరించి ప్రార్థించు

మనం చేసే ఎంపికలలో జ్ఞానవంతులుగా ఉండాలనే ఉద్దేశంతో దేవుడు మనకు ప్రార్థన అనే బహుమతిని లేదా వరాన్ని ఇచ్చాడు. మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్నయెడల అతడు దేవుని అడుగవలెను, అప్పుడది అతనికి అనుగ్రహింపబడును. ఆయన ఎవనిని గద్దింపక అందరికిని ధారాళంగా దయచేయువాడు (యాకోబు 1:5). కాబట్టి ప్రతి అంశం కోసం ప్రతి రోజు ప్రార్థన చేయాలి. మన జీవితాన్ని వృధా చేసే లేదా ఉపయోగం లేని దానిని ఎంపిక చేసుకోకుండా ఉండడం కోసం ప్రార్థన చేయాల్సిన అవసరముంది.

ప్రార్థన దేవునిని మార్చదు గానీ మనలను మారుస్తుంది. ప్రార్థన యొక్క విలువ ఏంటంటే దేవుని చిత్తాన్ని కనుగొనడంలో, దేవుని చిత్తానికి అనుగుణంగా మారడానికి సహాయం చేస్తుంది.

## 4. పవిత్రమైన ఆశలు గుర్తించాలి

ఇప్పుడు చెప్పబోయే సలహాను జాగ్రత్త కలిగి పరిగణించాలి. పరిశుద్ధాత్మ దేవుడు మన కెరీర్, పరిచర్య వంటి విషయాల్లో పరిశుద్ధమైన ఆశలను మన యొక్క హృదయాల్లో పుట్టిస్తాడు లేదా కలిగి

స్తాడు. ఈ ఆశలు మనం పరిశుద్ధమైన జీవితాలు జీవితాలు జీవించే సమయంలో కలిగే ఆశలు. ఈ ఆశలు కూడా దేవుని చిత్తాన్ని గ్రహించడంలో ప్రముఖమైన పాత్రను పోషిస్తాయి. ఈ కోరికలు లేదా ఆశలు మనము పాపంలో నడుస్తున్నప్పుడు, దేవునికి దూరమైనప్పుడు, ఆరాధనను ఆస్వాధించకుండా, దేవుని వాక్య ధ్యానమంలో ఆనందించకుండా, ఇతరులకు పరిచర్య చేయడంలో చురుకుగా లేనప్పుడు కలిగే ఆశలు కావు. ఆ సమయాల్లో కలిగే ఆశలు బహుశా అంత నమ్మదగినవి కావు. మన యొక్క జీవితం పట్ల దేవుని చిత్తము పరిశుద్ధత అయితే, పవిత్రమైన జీవితము నుండి ఉత్పన్నమయ్యే కోరికలు లేదా ఆశలు కూడా దేవుని చిత్తమును కనుగొనే విషయములో సురక్షితమైన మార్గదర్శకాలు అని చెప్పడం సురక్షితమే. ఈ కోరికలు రెప్పపాటులో వచ్చి పోయేవి కావు గానీ మరలా మరలా పునరావృత్తమవుతాయి. మారిపోయే అభిరుచులలాగా కాకుండా ఎంతో బలమైన కోరికలు గా, దేవుని మహిమ కేంద్రంగా ఉండే కోరికలు లేదా ఆశలుగా ఉంటాయి.

### 5. దేవుడు మనకు ఇచ్చిన ప్రత్యేకమైన సామర్థ్యాల ను గుర్తించాలి

దేవుడు మనకిచ్చిన సామర్థ్యాలు, తలాంతులు అనేవి ఎక్కడ ఎక్కువగా ఉపయోగపడతాయనే దానిని కూడా పరిగణించాలి. దేవుడు మనలో కొంతమందికి కొన్ని విషయాలలో ఇతరుల కంటే సామర్థ్యం, ప్రభావము కలిగి ఉండేలా డిజైన్ చేశాడు. కాబట్టి వాటిని గుర్తించడం ద్వారా కెరీర్ విషయంలో కూడా మనం నడిపింపుని పొందగలం.

అయితే దేవుని వాక్యములో మన అనుదిన జీవితములో ఎలా ఎంపికలు చేయాలి, ఆయన చిత్తాన్ని ఎలా తెలుసుకోవాలి అనే దానికి కొన్ని సాధారణ సూత్రాలను ఇచ్చాడు. వాటిని చూద్దాం.

1. ఇది న్యాయమైనదేనా? ఇది దేవుని వాక్యానుసారంగా, దేవుని చిత్తానుసారంగా ఉందా? ఎందుకంటే దేవుని వాక్యానికి విరుద్ధముగా ఉండే ప్రతి పని కూడా క్రైస్తవ విశ్వాసికి ఆమోదయోగ్యం కానిది అవుతుంది.
2. ఈ పని నాకు, ఇతరులకు ఉపయోగకరంగా ఉంటుందా? (1కొరింథీ 6:12). దేవుని వాక్యము నిన్నువలే నీ పొరుగువానిని ప్రేమించు అని ఆజ్ఞ ఇవ్వడం వెనుక మనము లోకము యొక్క నిజమైన అవసరాల వెలుగులో మన జీవితంలో ఎంపికలు చేయాలే గానీ కేవలం మన కోసము, మన సుఖాల కోసం జీవితంలో నిర్ణయాలు చేయకూడదు.
3. ఇది నన్ను బానిసగా చేస్తుందా? మన జీవితాలలో కొన్ని సంపూర్ణంగా న్యాయబద్ధమైనవే అయినా కొంతకాలానికి వాటికి బానిసలుగా చేసి, అవి మనకు విగ్రహాలుగా మారుతాయి, అది సంగీతము కావొచ్చు, క్రికెట్ కావొచ్చు, ఏదైనా కావొచ్చు.
4, ఇది పూర్తిగా క్రీస్తు యొక్క ప్రభుత్వానికి అనుగుణంగా ఉందా? 1 కొరింథీ 6:19-20
5. ఇది ఇతరులకు సహాయపడేదిగా ఉందా?. 1 కొరింథీ 10:33, 1 కొరింథీ 11:1
6. ఈ పని బైబిల్ ఉదాహరణలకు అనుకూలంగా ఉందా? మనము దేవుని వాక్యముతో ఎంత పోల్చి చూసుకొంటున్నాము?
7. ఇది దేవునికి మహిమ తీసుకొస్తుందా? దేవునికి మహిమ తెచ్చే ఏ అంశమైనా దేవుని చిత్తమే అవుతుంది.

### ముగింపు

మన అందరి జీవితాల పట్ల ఆయన చిత్తము క్రీస్తు సారూప్యంలోనికి మారడమే. కాబట్టి ఆయన యొక్క ఆజ్ఞలకు, వాక్యానికి విధేయత చూపించడం నేర్చుకోవాలి. దేవుని చిత్తము మన చిత్తానికి భిన్నంగా ఉండవచ్చు గానీ శ్రేష్టమైనది, సురక్షితమైనది. దేవుని రహస్య చిత్తమును తెలుసుకోవడం మన బాధ్యత కాదు గానీ ఆయన బయల్పరచిన చిత్తానికి సంపూర్ణంగా విధేయత చూపించడమే మన బాధ్యత. మన జీవిత అత్యున్నతమైన లక్ష్యం ఆయనను మహిమపరచడమే కాబట్టి ఆయన మహిమ వెలుగులో మన జీవిత నిర్ణయాలు లేదా ఎంపికలు చేద్దాము. స్వార్థంతో మన కొరకు కాకుండా దేవుని మహిమ కోసం ప్రజల మంచి కోసం ఉపయోగపడేలా కెరీర్‌ని ఎంపిక చేసుకొందాం.

**– నాసరయ్య,** వైజాగ్





# మానవుడు

నేను ఎవరు? అన్నది నాకు తెలియకుండా, నా జీవితం యొక్క అర్థం, పరమార్థం తెలియకుండా, అర్థవంతమైన జీవితం జీవించడం అసాధ్యం. మన గురించి మనకు తెలియాలంటే మూడు ప్రధానమైన ప్రశ్నలకు జవాబులు కావాలి. 1. మనం ఎక్కడ నుండి వచ్చాము? 2. ఈ భూమి మీద మనం ఎందుకు ఉంటున్నాం? 3. ఈ జీవితం తర్వాత ఎక్కడికి వెళ్తాము?

## 1. మన గురించి మనం తెలుసుకోవాల్సిన అవసరం ఏంటి?

- ❖ మానవుని పుట్టుక గురించి సమాజంలో గందరగోళం ఉంది కాబట్టి
- ❖ మానవుని జీవితం యొక్క అర్థం, పరమార్థం తెలుసుకోవడానికి
- ❖ మానవుని యొక్క నిజమైన అవసరాలు గుర్తించి వాటిని తీర్చడానికి
- ❖ మానవ సమస్యలను గుర్తించి వాటిని పరి ష్కరించడానికి
- ❖ మన గురించి మనకు తెలిస్తే మన ప్రవర్తన మంచి వైపు మళ్ళుతుంది కాబట్టి
- ❖ మన గురించి మనకు తెలిస్తే, మనల్ని సృష్టించిన సృష్టికర్తను తెలుసుకోవడానికి మార్గం దొరుకుతుంది కాబట్టి

"తన గురించి తాను తెలుసుకోనివారు తన జీవిత పరమార్థం డబ్బులోను, వస్తువుల్లోను, అధికారం మొ॥ వాటిలో వెతుక్కొంటారు. అవి దొరక్కపోతే జీవితం వ్యర్థం అనుకొంటారు." – థామస్ కార్లైల్

"నిన్ను నీవు తెలుసుకోవడం నీ జీవితానికి ప్రోత్సాహాన్నిస్తుంది" – జార్జ్ బెర్నార్డ్ షా


## 2. మానవుని గూర్చిన భిన్న అభిప్రాయాలు

- ❖ స్వాభావికంగా మనిషి సామాజిక జంతువు– సోక్రటీస్
- ❖ మనిషి మతపరమైన జంతువు – మార్క్‌ట్వైన్
- ❖ మనిషి అభివృద్ధి చెందిన/పరిణామం చెందిన జంతువు – ఛార్లెస్ డార్విన్
- ❖ మనిషి దేవుడు – శంకరాచార్యులు
- ❖ మనిషి చలిస్తున్న పదార్థం. మనిషిలో శరీరానికి అతీతమైన, నిత్యం ఉండే ఆత్మ ఏదీ లేదు, మనిషిలో మెదడుకు అతీతమైన మనస్సు ఏమీ లేదు. మనిషి అంతిమ గమ్యం మరణమే – నాస్తికులు

## 3. మానవుని ఆరంభం

### ఎ. జీవ పరిణామ సిద్ధాంతము

1859 లో చార్లెస్ డార్విన్ "ఆరిజన్ ఆఫ్ స్పీసీస్" (జాతుల ఉత్పత్తి/పరిణామ క్రమము) అనే గ్రంథములో పరిణామ సిద్ధాంతం గూర్చి రాశాడు. దీని ప్రకారం ఆదిలో నీటిలోని నిర్జీవ సేంద్రియ పదార్థాలనుండి సరళమైన జీవులు ఉద్భవించాయని అవి కాలక్రమేణా క్లిష్ట శరీర నిర్మాణం గల జీవులుగా ఏక కణ, బహు కణ జీవులుగా కప్ప, తొండ, పక్షి, పిల్లి,...కోతిగా..... మానవుడు పరిణామం చెందాడని చెప్పాడు. అతడు వివిధ రకాల జంతువుల రక్తాన్ని (హిమోగ్లోబిన్)



తీసుకొని మానవుని రక్తంలోని హిమోగ్లోబిన్‌తో పోల్చి చూశాడు. అప్పుడు కోతి రక్తంలోని హిమోగ్లోబిన్‌కి మానవ రక్తంలోని హిమోగ్లోబిన్‌కి దగ్గర పోలిక కనబడడాన్ని బట్టి మానవుడు కోతినుండి వచ్చాడని చెప్పాడు.

సైన్స్ ప్రకారం ఏదైనా నిరూపించాలంటే నాలుగు స్థాయిలు ఉంటాయి.

ఎ. **అబ్జర్వేషన్:** ఇక్కడ విశ్వాసంతో కూడిన అధ్యయనం లేదా అన్వేషణ జరుగుతుంది. ఉదా: చందమామ మీద నీళ్ళున్నాయి అనే విశ్వాసంతో పరిశీలన జరుగుతుంది.

బి. **హైపోథీసిస్:** పరికల్పన, ఊహ/తెలిసిన వాస్తవాలపై ఆధారపడినది, కానీ ఇంకా నిరూపించబడని దానికి సంబంధించిన ఆలోచన లేదా వివరణ.

సి. **థియరీ:** సిద్ధాంతం, ఒక అధ్యయన విషయం ఏ నియమాలపై ఆధారపడి ఉందో వాటి గురించి, లేక ఒక వాస్తవం, సంఘటనను, సాధారణంగా ఒక అభిప్రాయం, ఒక వివరణను అర్థమయ్యేలా చెప్పడానికి ప్రతిపాదించే ఆలోచనల గురించిన సరైన ప్రకటన.

డి. **లా:** సైద్ధాంతిక ప్రతిపాదనలు వాస్తవ ప్రపంచంలో నిరూపితమై, స్థాపించబడితే అది నియమం అవుతుంది. ఉదా: న్యూటన్ ప్రతిపాదించిన గురుత్వాకర్షణ శక్తి.

డార్విన్ ప్రతిపాదించిన జీవపరిణామ సిద్ధాంతం 165 సంవత్సరాలు అయినా ఇంకా సిద్ధాంతంగానే ఉంది, లా స్థాయికి రాలేదు.

### పరిణామ సిద్ధాంతంలో సమాధానం లేని ప్రశ్నలు

1. నిర్జీవ పదార్థంలోకి జీవం ఎలా వచ్చింది? ఏక కణజీవి ఎలా వచ్చింది? బహుకణ జీవిగా ఎలా మారింది?

2. ఇప్పుడు కోతి నుండి మానవుడు ఎందుకు రావడం లేదు?

3. ఆధారాలు ఏంటి? లింక్స్ ఏవి?

   1981 నవంబర్ 5న న్యూయార్క్‌లో జరిగిన సెమినార్‌లో బ్రిటీష్ శిలాజాల శాస్త్రవేత్త అయిన కోలిన్ ప్యాటర్సన్ "నేను 20 సంవత్సరాలకు పైగా జీవ పరిణామ సిద్ధాంతానికి సంబంధించి శిలాజాల ఆధారాల కోసం పని చేస్తున్నాను. నేను కొత్తగా ఏమీ కనుక్కోలేదు. పరిణామం గురించి మీకు తెలిసింది ఏదైనా చెప్పగలరా? అని ఆ సెమినార్‌లో అడిగినప్పుడు చాలాసేపు నిశ్శబ్దం ఆవరించింది. దేవుని గూర్చిన భావనను ప్రస్తావించకుండా ఈ విశ్వం యొక్క ప్రారంభం గురించి, మానవుని గురించి చర్చించడం కష్టం. కాబట్టి పరిణామ సిద్ధాంతం నిజం కాదని నిర్ధారించవచ్చు.

4. రెండవ ఉష్ణగతిక సూత్రం మరియు పరిణామ సిద్ధాంతం ఏవిధంగా సరిపోతుంది?

5. మానవునికి నైతికత, మనస్సాక్షి, దేవునిని గూర్చిన గ్రహింపు ఎక్కడనుండి వచ్చింది?

6. మానవుడు జంతువుకంటే భిన్నమైన వాడుగా ఎందుకున్నాడు?

7. మానవునికున్న సామర్థ్యం, శక్తి ఎక్కడ నుండి వచ్చాయి?

### బి. మానవుడు దేవునిచే సృష్టించబడ్డాడు

దేవుడు సృష్టి యావత్తును తన నోటి మాటచేత సృజించిన తర్వాత మానవుని సృజించాడు.

## 4. దేవుడు మానవుని ఎలా సృజించాడు?

**ఎ. తన చేతులతో నరుని చేశాడు:** దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది 2:7). అందుకే మట్టిలో ఉన్న మూలకాలు మానవ శరీరంలో కూడా ఉన్నట్లు రుజువవుతుంది, బ్రతికున్న మనిషిలో ఉచ్ఛ్వాస, నిశ్వాసలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి.

**బి. మానవుని తన స్వరూపంలో, పోలికలో చేశాడు (ఆది 1:26-28):** అందుకనే మానవుడు దేవుని యొక్క ప్రత్యేక సృష్టి. ఇక్కడ పోలిక అంటే ఆకారం అని కాదు, ఆయనకు ఉన్న లక్షణాలు అని అర్థం. ఉదాహరణకు కొన్ని లక్షణాలు చూద్దాం.

**ప్రేమించే తత్వం:** మనిషి ప్రేమించాలని, ప్రేమించబడాలని నిరంతరం కోరుకొంటూనే ఉంటాడు.

**సృజనాత్మకత:** నిరంతరం అనేక వస్తువులను, వాహనాలను విభిన్నంగా సృష్టిస్తున్నాడు.

**విచక్షణ జ్ఞానం:** హేతుబద్ధంగా ఆలోచించగలడు.

**జ్ఞానం/తెలివి:** ఈ భూమి మీద ఏ జీవికి లేని జ్ఞానం, తెలివి తేటలు మానవుని సొంతం. అందుకే లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న చంద్రుని మీదికి సైతం ఉపగ్రహాల్ని పంపగలుగుతున్నాడు.

**నైతికత:** తప్పు, ఒప్పులు, మంచి-చెడులు మానవులకు వర్తిస్తాయి.

**స్వేచ్ఛ:** దేవుడు మానవుని ఒక రోబోలాగా చేయలేదు. మానవునికి స్వేచ్ఛను ఇచ్చాడు. దానితో ఎంపిక చేసుకోవచ్చు, తన స్వంత చిత్తాన్ని ఉపయోగించవచ్చు. అయితే మనిషి తనకున్న స్వేచ్ఛను ఉపయోగించుకొని తప్పుడు ఎంపికలు చేస్తే నష్టపోతాడు.

మనిషి దేవుని పోలికలో ఉన్నప్పటికీ దేవునితో సమానుడు కాదు.

### సి. మానవుని ప్రాణము, ఆత్మ, దేహాల కలయికతో నిర్మించాడు (ఆది 2:7; 1 థెస్స 5:23)

| శరీరము | ప్రాణము | ఆత్మ |
|---|---|---|
| ❖ పదార్థం | ❖ పదార్థేతరం | ❖ పదార్థేతరం |
| ❖ లోక పరిజ్ఞానం ఇచ్చేభాగం, ఇదిలోక సంబంధమైనది | ❖ స్వయం వివేకం నిచ్చే భాగం | ❖ దేవునితో సంభాషించేది, సంబంధం కలిగి ఉండేది |
| ❖ ఆదికాండము 2:7 | ❖ శరీరాన్ని, ఆత్మను సమన్వయం చేస్తుంది | ❖ ప్రసంగి 12:7 |
| ❖ జ్ఞానేంద్రియాల ద్వారా ప్రపంచాన్ని అర్థం చేసు కొంటాడు | ❖ వ్యక్తిత్వం:<br>మనసు/జ్ఞానము - ఆలోచిస్తాడు<br>హృదయం - భావోద్రేకాలు<br>చిత్తం - నిర్ణయిస్తాడు | ❖ ఆత్మ<br>మానవుడు ఆత్మ కలిగి ఉన్నాడు<br>మానవునికి నైతికత ఉంది<br>మానవుని ఆత్మ దేవునిచే సృజించబడి దేవుని చేత కొనసాగింపబడుతుంది |

- ❖ మనిషి శరీరం దేవుని మంచి సృష్టిలో భాగమే.
- ❖ మానవ ఆత్మ స్వాభావికంగా దేవుని వలె నిత్యమైనది కాదు, దానిని దేవుడు సృష్టించి ఉనికిలో ఉంచుతున్నాడు (అపొ.కా. 17:25)
- ❖ శరీరము లోకమువైపు చూస్తుంది. ఆత్మ దేవునివైపు చూస్తుంది. వాటి మధ్య ప్రాణాన్ని సమన్వయం చేసుకోవాలి. ఎందుకంటే ఇది రెండిటికి చెందినది.
- ❖ ప్రాణము ఆత్మ ద్వారా దేవుని సంబంధమైన విషయాలను చేయగలదు.
- ❖ ప్రాణానికి స్వయం చిత్తం ఉంది కాబట్టి చుట్టూ ఉన్న పరిస్థితులలో ఏదైనా ఎన్నుకోవచ్చు.
- ❖ ఇలా సృష్టిలో ఏ ప్రాణికి లేని ఆధిక్యతను దేవుడు మనిషికి ఇచ్చాడు. అందుకే మనిషి ఒక ప్రత్యేకమైన వాడయ్యాడు.

## 5. దేవుడు మానవుని ఎందుకు సృజించాడు?

- ❖ ఆయనను ఎరగడానికి - అపొ.కా. 17:27
- ❖ ఆయనతో స్నేహం చేయడానికి- ఆది.కా. 3:8
- ❖ ఫలించి అభివృద్ధి పొంది విస్తరించి భూమిని నిండించి లోపరచుకోవడానికి, మరియు ఏలడానికి- ఆది 1:28
- ❖ ఆయనను ఆరాధించడానికి
- ❖ ఆయన మాట వినడానికి - ప్రసంగి 12:13
- ❖ తన మహిమ కొరకు - యెషయా 43:7
- ❖ తనతో నిత్యం జీవించాలని - ఆది 2:17

## 6. పతనానికి ముందు మానవుడు

**దేవునికి మానవునికి** మధ్య మంచి సహవాసం, సంబంధం కలిగి ఉంది. దేవుడైన యెహోవా చల్ల పూట ఆదాము, హవ్వతో సహవాసం కలిగి ఉన్నాడు (ఆది 3:8)

**మనిషి తనతో తాను** మంచి సంబంధం కలిగి ఉన్నాడు. తన జీవితంలో సిగ్గు, బిడియం, భయం,

ఆత్మన్యూనతా భావం ఏమీ లేవు. చాలా సంతోషంగా, ధృఢంగా ఉన్నాడు (ఆది 2:25)

**మనిషికి మనిషికి** మధ్య మంచి సామాజిక సంబంధం కలిగి ఉంది. ఆదాము కొరకు సాటియైన సహాయంగా హవ్వను సృజించి ఆదాము దగ్గరకు తెచ్చినప్పుడు ఆదాము హృదయంలో నుంచి హవ్వ పట్ల ప్రేమ అనురాగాలు పుట్టుకొచ్చి ఒక మంచి పద్యం చెప్పాడు (ఆది 2:23)

**మనిషికి ప్రకృతితో** మంచి సంబంధం కలిగి ఉంది. సముద్రం, అందులో చేపలు, భూమి అందులో మొక్కలు, చెట్లు, ఆకాశం, పక్షులు, వాతావరణం అన్నీ మనిషికి సహకరించాయి.

వీటన్నిటిని బట్టి మానవుడు **దైవకేంద్రిత జీవితం** కలిగి ఉన్నాడు.

### 7. విషాదం

దేవుడు మానవునికి ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకొని దేవుని మాటల యందు అవిశ్వాసం ఉంచి, సాతాను మాటల పట్ల విశ్వాసం ఉంచాడు. దేవుడు చేయమన్న మంచి చేయకుండా చేయవద్దు అన్న చెడు చేసి దేవుని ఆజ్ఞను ధిక్కరించాడు. దీనినే బైబిల్ పాపం అంటుంది. ఈ పాపం వల్ల **దైవ కేంద్రిత జీవితం** నుండి తొలిగిపోయి **స్వయం కేంద్రిత జీవితం** ప్రారంభించాడు.

### ముగింపు

మన దేశంలో ఉన్న కులవ్యవస్థ వాక్య విరుద్ధం. మానవులందరూ దేవుని స్వరూపంలో ఉన్నవారే, దేవుని దృష్టిలో సమానులే గనుక తోటి మనిషిని రూపం, ఆస్తి, అంతస్తు మొదలగు వాటిని బట్టి గాక దేవునిచే సృజించబడ్డాడని గౌరవించాలి. మనకున్న రూపాన్ని బట్టి అతిశయించకుండా లేదా కృంగిపోకుండా ప్రతి ఒక్కరూ దేవుని దృష్టిలో ప్రత్యేకమైనవారేనని అర్థం చేసుకోవాలి. ప్రాణం దేవుడిచ్చినది గనుక పరిస్థితులు అనుకూలంగా లేకపోతే ప్రాణం తీసుకొనే హక్కు మనకు లేదు. మానవుడు సృష్టి అంతటిలో విలువైనవాడు, దేవుడు తన స్వహస్తాలతో, ప్రత్యేకమైన ఉద్దేశాలతో రూపించుకొన్నాడు గనుక దేవునిని ఆరాధించాలి, ఆ ఉద్దేశాలకు అనుగుణంగా నడుచుకోవాలి.

– **జి వెంకట రమణ,** విజయవాడ




## సిలువ వేయబడిన
## హృదయాన్ని నాకివ్వు ప్రభూ

సిలువ వేయబడిన హృదయాన్ని నాకివ్వు ప్రభూ
నీతో కూడా మరణించిన హృదయాన్ని నాకివ్వు
దేవునిలో జీవిస్తున్న జీవితాన్ని నాకివ్వు ప్రభూ
నీ రక్తంతో పవిత్రపరచబడిన జీవితాన్ని నాకివ్వు

స్వార్థం చచ్చిన హృదయాన్ని నాకివ్వు ప్రభూ
ఈ లోకానికి చచ్చిన హృదయాన్ని నాకివ్వు
అహానికీ ఆశలకూ చచ్చిన హృదయాన్ని నాకివ్వు
స్వయం, స్వచిత్తం చచ్చిన హృదయాన్ని నాకివ్వు

నా పాత స్వభావాన్ని నీ సిలువలో వ్రేలాడదియ్యి
నేనీలోకాన్ని పెంటలా ఎంచుకొనేలా చెయ్యి
లోకాశలన్నీ చచ్చిపోయేంతగా నన్ను పవిత్రపరచు
లోకానికి చచ్చేటంతగా నన్ను పరిశుద్ధపరచు


సిలువ వేయబడిన వినయ మనసును నాకివ్వు
సున్నితమైన కరుణగలిగిన మనసును నాకివ్వు
సిలువ వేయబడిన స్వచ్ఛమైన మనసును నాకివ్వు
నీ ప్రతి పిలుపుకు ప్రతిస్పందించే మనసును నాకివ్వు

నా ఆశలు ఆశయాలు సిలువ వేయబడును గాక
నా ప్రేమ పరిపూర్ణతా స్థాయికి చేరుకొనును గాక
నన్ను నా సమస్తాన్ని సిలువకు మేకులతో కొట్టు
నన్ను పూర్తిగా నీ కొరకై సిలువలో సరిదిద్దు

ప్రభూ, నీ మరణం నిరంతరం నాలో ఉండనివ్వు
నా స్వయాన్ని పూర్తిగా సిలువ మేకులకు బంధించు
ప్రతి క్షణం సిలువ వేయబడిన అనుభవం నాకివ్వు
నా స్వరూపాన్ని పూర్తిగా నీ సారూప్యంలోకి మార్చు

– **వెస్లీ డ్యూయల్**

*(మెజర్ యువర్ లైఫ్ పుస్తకం నుంచి)*



# నాయకత్వం పారడాక్స్

'ఏ లీడర్ ఈజ్ ఎ డీలర్ ఇన్ హోప్' అని అంటాడు ఒకప్పటి ఫ్రెంచ్ చక్రవర్తి నెపోలియన్ బోనాపార్టీ.

ఒక దర్శనంతో, స్థిర నిశ్చయతతో తను ముందుకు కదులుతూ, తన వారిని గమ్యం వైపు నడిపించే వాడే నాయకుడు. విజన్, మిషన్ కలిగి ప్రజలను ఎక్కువకాలం ప్రభావితం చేయగలవాడే చరిత్రలో నిలిచే నాయకుడు.

## అధికారికి నాయకునికి మధ్య తేడాలు

| అధికారి | నాయకుడు |
|---|---|
| ❖ ఉన్నదానిని నిర్వహించడం ఇతని పని | ❖ మార్పు తీసుకొనిరావడం ఇతని పని |
| ❖ బలవంతం చేస్తాడు | ❖ శిక్షణ, తర్ఫీదు నిస్తాడు |
| ❖ అధికారాన్ని ఉపయోగిస్తాడు | ❖ మంచితనాన్ని ఉపయోగిస్తాడు |
| ❖ భయాన్ని పుట్టిస్తాడు | ❖ ఉత్సాహాన్ని పుట్టిస్తాడు |
| ❖ 'నేనే' అంటాడు | ❖ 'మనము' అంటాడు |
| ❖ విఫలమైనప్పుడు నిందించడంపైనే దృష్టి పెడతాడు | ❖ పరిష్కారాలమీద దృష్టి పెడతాడు |
| ❖ ఒక పని ఎలా చేయాలో తెలుసు (కాని చెప్పడు) | ❖ ఒక పని ఎలా చేయాలో చూపిస్తాడు |
| ❖ 'వెళ్ళు' అని అంటాడు | ❖ 'రండి, వెళ్దాం' అంటాడు |

## సేవక నాయకుడు, స్వయం కేంద్రిత నాయకుని మధ్య తేడాలు

సేవక నాయకుని ప్రాధాన్యత తన్ను తాను తగ్గించుకొని ఇతరుల యొక్క అభివృద్ధి, క్షేమం కోరుకొంటాడు. తనను వెంబడించే, తనకు అందుబాటులో, తన పరిధిలో ఉండే వ్యక్తుల, వ్యవస్థల, అవసరాలను తీర్చడమే ప్రాధాన్యతగా చేసుకొంటాడు. సేవకుడు తనకున్న అధికారాన్ని, ఇతరులకు సహాయపడే విధంగా వారిలో అవసరమైన మార్పును తీసుకువచ్చి తద్వారా సంఘానికి, సమాజానికి సేవచేసే వ్యక్తులుగా వారికి తర్ఫీదు ఇస్తాడు.

స్వయం కేంద్రిత నాయకుడు తనను తాను హెచ్చించుకొంటూ, తను చెప్పిందే వినాలని, తనకంతా తెలుసని, తన స్వప్రయోజనాలే ప్రాముఖ్యమని జీవిస్తూ ఉంటాడు.

## నాయకత్వం పారడాక్స్

సేవను, అధికారాన్ని సమన్వయం చేయకపోతే నాయకత్వంలో విరుద్ధ అభిప్రాయాలు (పారడాక్స్) తలెత్తుతాయి.

మత్తయి 20:26-28లో యేసుప్రభువు మాట్లాడుతూ "మీలో ఎవడు గొప్పవాడై యుండగోరునో వాడు మీ పరిచారకుడై యుండ వలెను; మీలో ఎవడు ముఖ్యుడై యుండగోరునో వాడు మీ దాసుడై యుండ వలెను, ఆలాగే మనుష్యకుమారుడు పరిచారము చేయించు కొనుటకు






రాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చెనని" చెబుతాడు.

నాయకునిగా మన ప్రభువైన యేసుక్రీస్తు తాను చేస్తూ మనకు మాదిరిగా ఉన్నాడు. తన బోధ, తన జీవన శైలి ఒకేవిధంగా ఉండేలా చూసుకొన్నాడు. తనకున్న అధికారాన్ని ప్రజలకు పరిచారం/సేవ చేయడానికి, సర్వమానవాళిని నరకం నుండి విడిపించడానికి, నిత్యజీవం ఉచితంగా ఇవ్వడానికి ఉపయోగించుకొన్నాడు. అధికారాన్ని, పరిచర్యను యేసుక్రీస్తు ప్రభువు చక్కగా సమన్వయం చేసుకొన్నాడు.

## నాయకులు మూడు రకాలు

### 1. నకిలీ నాయకులు

వీళ్ళు ప్రజలను నెగిటివ్‌గా ప్రభావితం చేస్తారు. వారు తమ అధికారాన్ని మంచిగా ఉపయోగిస్తున్నట్లు ఉంటుంది కానీ అంతిమంగా తప్పుడు ఉద్దేశాలతో ప్రజలను ఆశించిన స్థాయిలో ఎదగకుండా చేస్తారు. ప్రజలకు, తన క్రిందివారికి సరైన శిక్షణ అందించరు. మందకు మాదిరిగా ఉండడం కన్నా ప్రభువులు గా, గొప్పవారిగా ఉండడానికి ప్రాధాన్యత ఇస్తారు. మనము అలా ఉండకూడదని ప్రభువైన యేసు మత్తయి 20:25-26లో చెప్పాడు.

### 2. అర్హతలేని నాయకులు

వారు ఆ స్థానంలో ఉండడానికి అర్హులు కారు. పేరుకు మాత్రమే నాయకులు, పని మాత్రం ఇతరులు చేస్తారు. ఇతరుల పనిని, పరిచర్యను వారు తమ ఖాతాలో వేసుకొంటారు. తమకు అప్పగించబడిన మంద పట్ల సరిగా శ్రద్ధ చూపించరు. రిస్క్ తీసుకోవడానికి ఆసక్తి చూపించరు. పేరు మాత్రం కోరుకొంటారు. క్షేత్రస్థాయిలో పనిచేయడానికి ఇష్టపడరు కాని సమావేశాలకు హాజరవుతూ ఉంటారు.

### 3. నిజమైన నాయకులు

వీరు ప్రజలను ఉత్తేజితులుగా, శక్తిమంతులు గా చేస్తారు. తమకు అప్పగించబడిన వారిని, తారసపడినవారిని, అవసరంలో ఉన్నవారిని పురికొల్పుతూ, కౌన్సిలింగ్ చేస్తూ, సహాయపడుతూ, సరిచేస్తూ ముందుకు సాగుతారు. ప్రభువైన యేసును మాదిరిగా వెంబడిస్తూ, ప్రజలను యేసువైపుకు త్రిప్పుతూ, తనతోపాటు అంతం వరకు నమ్మకంగా వెంబడించాలని దిశా, నిర్దేశం చేస్తారు.

## ముగింపు

విద్యార్థులుగా, గ్రాడ్యుయేట్స్‌గా, స్టాఫ్‌గా మన పరిచర్యలో, సంఘ పరిచర్యలో మొదటి రెండు రకాల నాయకులుగా ఉండకూడదు. మొదటి రకం నాయకులతో డైరెక్ట్‌గా మాట్లాడి వారిని సరిచేయాలి. రెండవ రకపు నాయకుల్ని ఎక్విప్ చేయడానికి మనవంతు కృషి చేయాలి. వారికి అవగాహన కల్పించాలి, సరైన దిశలో నడిపించాలి. మూడవ రకపు నాయకుల పర్యవేక్షణలో ప్రజలు సురక్షితంగా, ఆనందంగా గమ్యం వైపు పయనిస్తారు.

యంపిసిల ద్వారా మెంటరింగ్, బైబిల్ స్టడీస్ ద్వారా డిసైపులింగ్ చేస్తూ యుఇయస్ఐ పరిచర్యలో విద్యార్థిగా, గ్రాడ్యుయేట్‌గా, స్టాఫ్‌గా దేవుడు మనకు అప్పగించిన పనిని బాధ్యతగా, మాదిరిగా, నమ్మకంగా నెరవేర్చాలని కోరుతున్నాను.

– **టి. థియోఫిలస్,** ప్రిన్సిపల్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, ఆదర్శ్ డిగ్రీ కాలేజ్, వైజాగ్



# ప్రభావం చూపిన నాయకుడు

మోషే ఐగుప్తులో జన్మించి మోయాబు దేశంలో చనిపోయాడు. 120 సం॥ జీవించాడు. ఈ 120 సం॥ జీవితంలో ఎన్నో మలుపులు. దాసత్వంలో జన్మించి, నదిలో వదిలివేయబడ్డాడు. ఫరో కుమార్తె కుమారునిగా పెరిగి, ఐగుప్తు సకల విద్యలను అభ్యసించాడు. తన ప్రజలను ప్రేమించి ఇశ్రాయేలీయుల వద్దకు వస్తే వారిచేత నిరాకరించబడి, ఐగుప్తునుండి పారిపోయి మిద్యాను అరణ్యంలో గొర్రెల కాపరిగా జీవితాన్ని కొనసాగించాడు. దేవుని ప్రత్యక్షతతో పిలవబడి నాయకునిగా ఇశ్రాయేలీయులను ఐగుప్తు నుండి విడిపించి, నడిపించడానికి సిద్ధపడ్డాడు.

ఐగుప్తునుండి బయటకు వచ్చిన వారు పిల్లలు గాక 6 లక్షల వీరులు, అనేకులైన అన్యజనులు. వీరు దేవుని గొప్పతనాన్ని ఎన్నో సార్లు గమనించినా సణుగుతూ, దేవునికిష్టులుగా ఉండక, దేవునిని శోధిస్తూ, విగ్రహారాధికులుగా, వ్యభిచారులుగా, మోషే నాయకత్వాన్ని ప్రశ్నించే వారుగా, ఐగుప్తు జీవితాన్ని జీర్ణించుకున్న వారుగా ఉన్నారు. భిన్న పరిస్థితుల్లో, సమస్యల్లో ఇలాంటి లక్షణాలు గల ఇశ్రాయేలీయులను 40 సం॥ పైగా నాయకుడిగా ముందుండి నడిపించడం ఓ గొప్ప సవాలే. సమస్య ఉన్న ప్రతిసారి మోషే దేవుని వైపు చూశాడు. దేవుడు గొప్ప పరిష్కారాన్ని ఇస్తూ వచ్చాడు.

మోషే బతికిన 120 సం॥లలో దేవుడు ఆయనను వాడుకున్న విధానం గమనిస్తే, దేవుడు ఆయనతో ముఖాముఖిగా మాట్లాడుతూ మోషే ద్వారా పంచకాండాలు (బైబిల్లో మొదటి ఐదు పుస్తకాలు) రాయించాడు. ఇవి బైబిల్‌కు ఆయువు పట్టులాంటివి. ధర్మశాస్త్రం ఇవ్వబడింది (యోహాను 1:17). ధర్మశాస్త్రం లేకపోతే మానవులకు ఒక నీతి ప్రమాణం ఉండేదికాదు (ద్వితీ 4:8; కీర్తన 19:7-9; 119:142), పాపాన్ని గుర్తించి, బహిర్గతం చేయడం అంటే ఏమిటో తెలిసేది కాదు (రోమా 3:20), దేవుడు ఎలాంటివాడో, దేవుని పరిశుద్ధత ఎలాంటిదో తెలిసేది కాదు (ద్వితీ 28:58; 33:2). ప్రత్యక్ష గుడారం నమూనా మోషేకు ఇవ్వబడింది. ఇది ఆరాధన క్రమాన్ని తెలియజేస్తుంది. (నిర్గమ 25:8, 29:45). ఎర్రసముద్రం పాయలుగా చేయడం, 40సం॥ మన్నాను భుజించడం (నిర్గమ 16:35).

దేవుడు మోషే గురించి ఇచ్చిన సాక్ష్యం ఏంటంటే... భూమిమీద నున్న వారందరిలో మిక్కిలి సాత్వికుడు (సంఖ్యా 12:3), దేవుని ఇల్లంతటిలో నమ్మకమైనవాడని (సంఖ్యా 12:7), యెహోవాను ముఖాముఖిగా ఎరిగిన మోషే వంటి ఇంకొక ప్రవక్త ఇశ్రాయేలీయులలో ఇదివరకు పుట్టలేదు (ద్వితీ 34:12).

యాభై, వంద, లేదా వెయ్యిమందికి నాయకునిగా ఉండి నడిపించడానికి సతమతమౌతున్న ఈ రోజుల్లో మోషే 6 లక్షలపైగా ఉన్న ఇశ్రాయేలీయులను, భిన్న సమస్యల్లో నడిపించడం మనకు మాదిరి. దేవుడు మనకిచ్చిన ఆయుష్షులో మలుపులు ఎన్నో ఉండవచ్చు, దేవుని చేత పిలవబడిన నాయకునిగానే ఉన్నా నడిపించేటప్పుడు, సమస్యలు అనేకం ఉన్నప్పుడు, కొన్ని సార్లు మన నాయకత్వాన్ని ఇతరులు ఎదిరించే పరిస్థితులున్నప్పుడు మోషే ఏలాగు దేవునివైపు చూశాడో అలాగే మనం కూడా దేవుని వైపు చూసి పరిష్కారం పొందేవారంగా ఉండాలి. దేవుని తోడును కోరుకొనేవారంగా ఉండాలి. దేవుడు మోషేను గొప్పగా వాడుకోవడానికి కారణం దేవుని పిలుపు, దేవుని తోడు, సాత్వికం, నమ్మకత్వమే. ఒక నాయకునికి అనేక నైపుణ్యాలు ఉన్నా దేవునివైపు చూడటం, సాత్వికం, నమ్మకత్వం అనే లక్షణాలు ఉన్నాయా లేవా అని పరిశీలించుకోవాలి. ఇవి లేకపోతే దేవుని పరిచర్యలో ఇతరులకు మాదిరిగా ఉండలేం, గొప్ప ప్రభావాన్ని తీసుకురాలేం.

ఒక నాయకునిగా మోషే తన 120 సం॥ జీవితంలో తర్వాత తరానికి వదిలివెళ్ళిన వారసత్వం పంచకాండాలు, ధర్మశాస్త్రం, నమ్మకత్వం, సాత్వికం, ప్రతిపరిస్థితిలో దేవునివైపు చూడటం. నాయకులుగా మన ఆయుష్కాలంలో తర్వాత తరానికి వదిలివెళ్ళే వారసత్వం ఏంటి?

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No.: **GTR/59/2024-2026**
**Date of Printing: 25-04-2024**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

## నాయకుడంటే
# నీలా ఉండాలి!

ఎన్నివేల మెట్లు దిగి వచ్చావో
చివరి మెట్టుమీద నన్ను కలవడానికి
అందరూ నాలో మట్టినే చూశారు
నువ్వు మాత్రం మెరుపును చూశావు

నకిలీ నాయకులంతా
పొడవాటి అంగీలుగా మారి
అంత:పురాల చుట్టూ అల్లుకొంటూ ఉంటే
నువ్వు మాత్రం
మురికి వాడల మధ్య
వజ్రాల్ని సానబెడుతూ కనిపించావు

సత్య సూత్రాల్ని
ఉపమానాల ఊటలుగా మార్చి
మా ప్రాణ నాడుల్లోకి ప్రవహింపజేశావు
నువ్వు వదిలి వెళ్లే దూరాల్ని మేము చేరేలా
నువ్వు విత్తివెళ్లే పంటను మేము కోసేలా
విశ్వ దర్శనాన్ని మాలో విస్తరింపజేశావు

దయ్యం చేతిలో ఓడినప్పుడు
అవిశ్వాస అలల కింద మునిగినప్పుడు
పనికిరాని మా ప్రగల్భాలను వెక్కిరిస్తూ
కోడి మూడుసార్లు కూసినప్పుడు
అస్తమించిన మా ఆత్మస్థైర్యం మీద
ఆశల పొద్దయి పొడిచావు

నమ్రత నాయకుని లక్షణమని
నీ చేతిలో నీళ్ళ గిన్నె చూశాకే తెలిసింది
లేకపోతే కుర్చీలు, కిరీటాలే
మా నాయకత్వ నిర్వచనాలు

మమ్మల్ని కట్టడానికే గదా
నువ్వు గోధుమ రొట్టెలా విరిగి పోయావు
జట్టును పచ్చని చెట్టులా నిలబెట్టడానికి
నువ్వు ఎండిన కొయ్య మీద ఒరిగిపోయావు

అధికార వికార రూపాల
పీడకలలు మా నాయకులు!
పదవుల్ని గెలిచారు తప్ప
హృదయాల్ని కాదు
నువ్వు మాత్రం సేవక నాయకుడివై
ప్రపంచాన్నే గెలిచావు

నాయకత్వ చరిత్రలో
నువ్వో కొత్తశకం
నాయకత్వ పుటల్లో
నీదే అసలు సంతకం

– ప్రసాద్ తాళ్ళూరి



UESI PUBLICATIONS Since 1988
**UESI PUBLICATION TRUST - ANDHRA PRADESH BRANCH**
Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 0 07. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508